


పాఠకులకు, చందాదారులకు, విలేకరులకు, శ్రేయోభిలాషులకు సంక్రాంతి శుభాకాంక్షలు. గురువారం సూర్య దినపత్రిక కార్యాలయానికి సెలవు. రేపు పత్రిక వెలువడదు. పునఃదర్శనం శనివారం

Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 204 | గురువారం 15 జనవరి 2026 | పేజీలు : 8 | వెల రూ. 6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

# తక్షణమే ఇరాన్‌ను వీడండి

- భారతీయులకు రాయబార కార్యాలయం కీలక సూచనలు
- ఇరాన్‌లో తీవ్ర ఉద్రిక్తంగా మారిన పరిస్థితులు
- కీలక ఆదేశాలు జారీ చేసిన భారత రాయబార కార్యాలయం
- అందుబాటులో ఉన్న రవాణా మార్గాల ద్వారా ఇరాన్‌ను వీడాలని సూచన

టెహరాన్‌- సూర్య వాస్తవం

ఇరాన్‌లో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. గత కొన్ని రోజులుగా కొనసాగుతోన్న ఆందోళనల కారణంగా అక్కడ మారణహోమం చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. వేలాది మంది మృతి చెందగా, అందులో ఆందోళన కారులు 1,850 మంది, భద్రతా దళాల సిబ్బంది 135 మంది ఉన్నారు. ఆందోళనలతో సంబంధం లేని వారు కూడా పదుల సంఖ్యలో మరణించారు. ఆ దేశంలో ఎస్‌ఎంఎస్‌లు, ఇంటర్నెట్‌ సేవలు నిలిచిపోయాయి. ఇరాన్‌లో ఆందోళనలు తీవ్ర హింసాత్మకంగా మారుతున్న నేపథ్యంలో ఆ దేశంలో నివసిస్తున్న భారతీయులను అక్కడి భారత రాయబార



కార్యాలయం అప్రమత్తం చేసింది. అందుబాటులో ఉన్న రవాణా మార్గాల ద్వారా ఇరాన్‌ను వీడాలని సూచించింది. "ఇరాన్‌లోని భారత - మిగతా 2లో..

# అందరి జీవితాల్లో ఆనందం, శ్రేయస్సు నిండాలి

- దేశ ప్రజలకు ప్రధాని మోదీ మకర సంక్రాంతి శుభాకాంక్షలు
- సూర్య భగవానుడు అందరినీ ఆశీర్వదించాలని ప్రార్థన
- శుభాకాంక్షలు తెలియజేసిన కేంద్ర మంత్రులు నడ్డా, జైశంకర్



న్యూఢిల్లీ- సూర్య వాస్తవం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం దేశ ప్రజలకు మకర సంక్రాంతి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ అందరి జీవితాల్లో శ్రేయస్సు, విజయం తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ - మిగతా 2లో..



# కర్ణాటక పాలిటిక్స్‌లో హీట్‌

- మైసూరు ఎయిర్‌పోర్ట్‌లో రాహుల్‌తో సీఎం సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌ భేటీ
- కర్ణాటక కాంగ్రెస్‌లో మరోసారి రాజుకున్న నాయకత్వ మార్పు చర్చ
- రాజకీయాలేమీ చర్చించలేదని, మీడియా ఊహాగానాలేనన్న సిద్ధరామయ్య
- అవసరమైతే ఇద్దరినీ ఢిల్లీకి పిలుస్తామని గతంలోనే చెప్పిన అధ్యక్షుడు ఖర్గే
- అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉంటామని ఇరువురు నేతల ప్రకటన

బెంగళూరు - సూర్య వాస్తవం

కర్ణాటక కాంగ్రెస్‌లో నాయకత్వ మార్పుపై జరుగుతున్న ప్రచారానికి మంగళవారం జరిగిన ఓ సంఘటన మరింత బలాన్నిచ్చింది. కాంగ్రెస్‌ అగ్రనేత రాహుల్‌ గాంధీతో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ మైసూరు విమానాశ్రయంలో వేర్వేరుగా, కలిసి సమావేశమవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. దీంతో సీఎం మార్పు అంశం మరోసారి తెరపైకి వచ్చింది. జనవరి 13 సాయంత్రం, - మిగతా 2లో..

# ఘోర రైలు ప్రమాదం..

- థయ్‌లాండ్‌లో రైలుపై కూలిన క్రేన్‌, 22 మంది మృతి
- రైలుపై నిర్మాణంలో ఉన్న క్రేన్‌ కూలడంతో ఘటన
- ప్రమాదంలో 22 మంది మృతి, 30 మందికి పైగా గాయాలు
- హైస్పీడ్‌ రైలు ప్రాజెక్టు పనుల సమయంలో దుర్ఘటన
- ప్రమాదంపై థయ్‌లాండ్‌ ప్రభుత్వం విచారణకు ఆదేశం



థయ్‌లాండ్‌- సూర్య వాస్తవం

థయ్‌లాండ్‌లో బుధవారం ఘోర రైలు ప్రమాదం జరిగింది. నిర్మాణంలో ఉన్న హైస్పీడ్‌ రైల్వే లైన్‌కు చెందిన భారీ క్రేన్‌ ఒకటి ప్రయాణికులతో వెళ్తున్న రైలుపై కూలిపోవడంతో 22 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దుర్ఘటనలో మరో 30 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే, బ్యాంకాక్‌కు ఈశాన్యంగా సుమారు 230 కిలోమీటర్ల దూరంలోని నఖోన్‌ రచాసిమా ప్రావిన్స్‌లోని సిఖియో జిల్లాలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 9 గంటల సమయంలో, బ్యాంకాక్‌ నుంచి ఉబాన్‌ రచాథని ప్రావిన్స్‌కు వెళ్తున్న స్పెషల్‌ ఎక్స్‌ప్రెస్‌ నెం.21 రైలుపై క్రేన్‌ కూలింది. ఈ రైలులో ప్రమాద సమయంలో 195 మంది ప్రయాణికులు, సిబ్బంది ఉన్నారు.

క్రేన్‌ బలంగా ఢీకొట్టిన ధాటికి రైలుకు చెందిన మూడు బోగీలు పట్టాలు తప్పాయి. వెంటనే మంటలు చెలరేగి దట్టమైన పొగలు కమ్ముకున్నాయని అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. హైడ్రాలిక్‌ కట్టర్ల - మిగతా 2లో..

## ఎన్టీవీ జర్నలిస్టుల అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నా

- అర్ధరాత్రి తలుపులు పగలగొట్టి అరెస్ట్‌ చేయడం దారుణమన్న వైఎస్‌ జగన్‌
- ఇది పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామ్య విలువలపై జరిగిన దాడి అని వ్యాఖ్య
- అరెస్ట్‌ అయిన జర్నలిస్టులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్‌ - రాజ్యాంగాన్ని, చట్టాలను గౌరవించాలని ప్రభుత్వానికి హితవు



2లో

## కవయిత్రి ఇందిరా ధనరాజ్‌గిర్‌ మృతి

- సాహితీ లోకానికి తీరని లోటు
- డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌

2లో

## ఏపీలో ఆరోగ్య రంగానికి రూ. 567 కోట్లు విడుదల

2లో

## మకర సంక్రాంతి - పంటల పండుగ...

- నేడు సంక్రాంతి పండుగ

2లో

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## భోగి వేడుకల్లో సీఎం చంద్రబాబు కుటుంబం





చంద్రగిరి - సూర్య వాస్తవం

నారావారిపల్లెలో బుధవారం జరిగిన భోగి వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. హరిదాసుల సంకీర్తనలు, గంగిరెద్దుల ప్రదర్శనలను భార్య భువనేశ్వరితో సహా కుటుంబ సభ్యులతో కలిసి సిఎం ఆసక్తిగా తిలకించారు. తెలుగు సంస్కృతి సంప్రదాయాలను చాటి చెప్పేలా నారావారిపల్లెలో భోగి వేడుకలు ఘనంగా జరిగాయి.



## 18న మేడారానికి సీఎం, మంత్రుల రాక

- బహిరంగ సభకు ఏర్పాట్లు
- 19న మేడారం గద్దెలు, ప్రాంగణ పునరుద్ధరణ పనులప్రారంభోత్సవం
- పనులపై సమీక్షించిన మంత్రి సీతక్క

ములుగు - సూర్య వాస్తవం

ఈ నెల 18న సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు మేడారానికి రానున్న నేపథ్యంలో ఏర్పాట్లపై పంచాయతీ రాజ్‌, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై బుధవారం మేడారం హరిత హోటల్‌లో మంత్రి సీతక్క, - మిగతా 2లో..

# అందరి జీవితాల్లో ఆనందం, శ్రేయస్సు నిండాలి

(మొదటిపేజీ తరువాయి)

'శ' వేదికగా స్పందిస్తూ, "పవిత్రమైన మకర సంక్రాంతి సందర్భంగా దేశ ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో భాగమైన నువ్వులు-బెల్లం తీపిదనంతో నిండిన ఈ దివ్యమైన పండుగ, ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందం, శ్రేయస్సు, విజయాన్ని తీసుకురావాలి. సూర్య భగవానుడు మనందరినీ ఆశీర్వదించాలి" అని పేర్కొన్నారు. మకర సంక్రాంతి, మాఘ్ బిహు, పొంగల్ వంటి పండుగలు భారతదేశపు పంట కోతల పండుగలని, ఇవి మన దేశ సంప్రదాయాల గొప్పతనాన్ని చాటి చెబుతాయని ఈ సందర్భంగా గుర్తుచేశారు. వ్యవసాయ సంస్కృతితో ముడిపడి ఉన్న ఈ పండుగలు రుతువుల మార్పుకు సూచికగా నిలుస్తాయని, ప్రకృతి, సాంస్కృతిక వైవిధ్యం, సామాజిక సామరస్యాన్ని ప్రతిబింబిస్తాయని తెలిపారు. కేంద్ర మంత్రి జేపీ నడ్డా కూడా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. "ధర్మం, సేవ, దానధర్మాలతో ముడిపడిన ఈ పవిత్ర పండుగ సందర్భంగా అందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను సుసంపన్నం చేసే ఈ పండుగ సమాజానికి సానుకూలత, సమానత్వం, అంకితభావాన్ని అందిస్తుంది. ఈ పర్వదినం అందరి జీవితాల్లో ఆరోగ్యం, శ్రేయస్సు, సౌభాగ్యం తీసుకురావాలని సూర్య భగవానుడిని ప్రార్థిస్తున్నాను" అని ఆయన అన్నారు. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ స్పందిస్తూ, "మకర సంక్రాంతి, మాఘ్ బిహు, పొంగల్ సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు. ఈ పండుగలు అందరికీ శ్రేయస్సు, శాంతి, సమృద్ధిని ప్రసాదించాలి" అని ఆకాంక్షించారు

# ఘోర రైలు ప్రమాదం...

(మొదటిపేజీ తరువాయి)

సహాయంతో బోగీలలో చిక్కుకున్న ప్రయాణికులను బయటకు తీసి, క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. "ఈ ప్రమాదంలో 22 మంది మరణించగా, 30 మందికి పైగా గాయపడ్డారు" అని నఖోన్ రచాసిమా ప్రావిన్షియల్ పోలీస్ చీఫ్ థచాపోన్ చిన్నవాంగ్ మీడియాకు ధ్రువీకరించారు. మృతుల సంఖ్యపై తొలుత భిన్నమైన నివేదికలు వెలువడినప్పటికీ, చివరకు పోలీసులు 22 మంది మరణించినట్లు స్పష్టం చేశారు. థయ్-చైనీస్ హై-స్పీడ్ రైల్వే ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో భాగంగా ఈ క్రేన్‌ను ఉపయోగిస్తున్నారు. ఈ ఘటనపై థయ్‌లాండ్ రవాణా శాఖ మంత్రి ఫిఫత్ రచాకిత్‌ప్రకార్న్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై సమగ్ర దర్యాప్తు జరపాలని స్టేట్ రైల్వే ఆఫ్ థయ్‌లాండ్ ను ఆయన ఆదేశించారు.

# కర్ణాటక పాలిటిక్స్‌లో హీట్

(మొదటిపేజీ తరువాయి)

తమిళనాడులోని ఓ ప్రైవేట్ కార్యక్రమానికి వెళ్లి తిరిగి ఢిల్లీ వెళ్లేందుకు రాహుల్ గాంధీ మైసూరు విమానాశ్రయానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు వీడ్కోలు పలికేందుకు వచ్చిన సిద్ధరామయ్య, శివకుమార్‌లతో ఆయన కొద్దిసేపు మంతనాలు జరిపారు. అయితే, భేటీ అనంతరం సిద్ధరామయ్య మీడియాతో మాట్లాడుతూ.. రాహుల్‌తో ఎలాంటి రాజకీయ చర్చలు జరగలేదని, ఇదొక మర్యాదపూర్వక భేటీ మాత్రమేనని స్పష్టం చేశారు. సీఎం మార్పుపై వస్తున్న వార్తలన్నీ మీడియా సృష్టేనని కొట్టిపారేశారు. మరోవైపు, డీకే శివకుమార్ కార్యాలయం మాత్రం రాహుల్‌తో చర్చలు జరిగినట్లు ఒక ప్రకటన విడుదల చేసింది. 2023 మే నెలలో ప్రభుత్వం ఏర్పడినప్పుడు సిద్ధరామయ్య, శివకుమార్ చెరి రెండున్నరేళ్లు సీఎం పదవిని పంచుకోవాలని ఒప్పందం కుదిరినట్లు ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు దాటడంతో నాయకత్వ మార్పు కోసం శివకుమార్ వర్గం ఒత్తిడి పెంచుతోందని వార్తలు వస్తున్నాయి. క్యాబినెట్ విస్తరణకు అనుమతి కోసం సిద్ధరామయ్య కూడా అధిష్ఠానంతో భేటీకి ప్రయత్నిస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో, అవసరమైతే ఇరువురు నేతలను ఢిల్లీకి పిలిచి చర్చిస్తామని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఇదివరకే తెలిపారు. ప్రస్తుతం ఈ భేటీతో కర్ణాటక రాజకీయాలు వేడెక్కగా, అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే దానిపై సర్వత్ర ఉత్కంఠ నెలకొంది.

## ఎన్టీవీ జర్నలిస్టుల అరెస్టును

# తీవ్రంగా ఖండిస్తున్నా

- అర్ధరాత్రి తలుపులు పగలగొట్టి అరెస్ట్ చేయడం దారుణమన్న వైఎస్ జగన్
- ఇది పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామ్య విలువలపై జరిగిన దాడి అని వ్యాఖ్య
- అరెస్ట్ అయిన జర్నలిస్టులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్
- రాజ్యాంగాన్ని, చట్టాలను గౌరవించాలని ప్రభుత్వానికి హితవు

**అమరావతి– సూర్య వాస్తవం**

తెలంగాణలో ఎన్టీవీ జర్నలిస్టుల అరెస్ట్‌ను వైసీపీ అధినేత జగన్ తీవ్రంగా ఖండించారు. ఈ చర్య పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామ్య విలువలపై జరిగిన దాడిగా ఆయన అభివర్ణించారు. పండుగ సమయంలో అర్ధరాత్రి పూట ఇళ్ల తలుపులు బద్దలుకొట్టి, ఎలాంటి చట్టపరమైన ప్రక్రియను పాటించకుండా, కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా జర్నలిస్టులను అరెస్ట్ చేయడం అత్యంత దారుణమని మండిపడ్డారు. ఇది ప్రభుత్వ నిరంకుశ ధోరణికి స్పష్టమైన నిదర్శనమని జగన్ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఆయన సోషల్ మీడియాలో స్పందిస్తూ, "జర్నలిస్టులు నేరస్తులు కాదు, ఉగ్రవాదులు అంతకన్నా కాదు. అయినా వారి పట్ల ఇంత కఠినంగా వ్యవహరించడం సరికాదు. ఇలాంటి చర్యల వల్ల వారి కుటుంబ సభ్యులు తీవ్రమైన మానసిక వేదనకు గురవుతారు. అంతేకాకుండా, మీడియా వర్గాలలో భయాందోళనకర వాతావరణం నెలకొంటుంది" అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ తీరు రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగించేలా ఉందని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా తన వైఖరిని మార్చుకోవాలని జగన్ హితవు పలికారు. అరెస్ట్ చేసిన జర్నలిస్టులను తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ప్రభుత్వం రాజ్యాంగాన్ని గౌరవించాలని, చట్టబద్ధమైన పాలనను కొనసాగించాలని, పత్రికా స్వేచ్ఛను పరిరక్షించాలని జగన్ గట్టిగా డిమాండ్ చేశారు. చట్టానికి ఎవరూ అతీతులు కారని, కానీ చట్టాన్ని అమలు చేసే విధానంలో హుందాతనం, పారదర్శకత ఉండాలని సూచించారు. జర్నలిస్టుల హక్కులను కాలరాయడం ద్వారా ప్రజాస్వామ్యానికి నష్టం కలిగించవద్దని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## 18న మేడారానికి

# సీఎం, మంత్రుల రాక

(మొదటిపేజీ తరువాయి)

జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., జిల్లా ఎస్పీ రామ్‌నాథ్ కేకన్, ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రా, జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్‌తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మేడారం చేరుకున్న అనంతరం అక్కడే బస చేయనున్నారని, 19న సమ్మక్క-సారలమ్మ గద్దెలు, ప్రాంగణ పునరుద్ధరణ పనుల ప్రారంభోత్సవం చేయనున్నట్టు తెలిపారు. 18న రాష్ట్రస్థాయి యంత్రాంగం మొత్తం మేడారంలోనే ఉండనున్నందున ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని అధికారులకు సూచించారు. క 18న ఆదివారం కావడం, పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ముగియనుండటంతో సందర్శకుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందని, ఆ దృష్టితో ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. మేడారం అభివృద్ధి పనుల్లో సహకరిస్తున్న జిల్లా అధికారులు, వారి బృందాలకు, జిల్లా ప్రజలకు భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు మంత్రి తెలిపారు.

ముఖ్యమంత్రి రాక సందర్భంగా ముందుగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ప్రొటోకాల్, బందోబస్తు, వసతి, సాంస్కృతిక కార్యక్రమాలు, జాతర ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. హెలిప్యాడ్ నిర్వహణ పనులను ఆర్అండ్‌బీ శాఖకు అప్పగించారు. మేడారం జాతరతోపాటు గద్దెల ప్రాంగణ పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీపీఓను ఆదేశించారు.ముఖ్యమంత్రి, వీఐపీ ప్రొటోకాల్ బాధ్యతలను ఆర్డీఓ వెంకటేష్‌కు అప్పగించారు. బహిరంగ సభ నేపథ్యంలో జిల్లాలో ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు తెలిపారు. ఆదివాసీ సంస్కృతి ప్రతిబింబించేలా ధింసా, కోయ, గుస్సాడి, కొమ్ము కోయ తదితర సాంస్కృతిక కళా ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. ముఖ్యమంత్రి భద్రత, రూట్‌మ్యాప్, పార్కింగ్, గార్డ్ ఆఫ్ ఆనర్ ఏర్పాట్లను ఎస్పీ రామ్‌నాథ్ కేకన్ పర్యవేక్షించనున్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మహేందర్ జీ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంపత్‌రావు, ఆర్డీఓ వెంకటేష్, జిల్లా అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## చోరీ రూ 5వేల కన్నా తక్కువ వుంటే

# పోలీసులు నేరుగా కేసు నమోదుకు వీల్లేదు

- స్పష్టం చేసిన హైకోర్టు
- మేజిస్ట్రేట్ నుంచి అనుమతి తీసుకోవాలి

**అమరావతి – సూర్య వాస్తవం**




చోరీ ఆస్తి విలువ రూ.5వేలు, అంతకంటే తక్కువగా ఉంటే పోలీసులు నేరుగా కేసు నమోదు చేయడానికి వీల్లేదని హైకోర్టు స్పష్టం చేసింది. అది 'నాన్-కాగ్నిజబుల్' నేరం కిందకు వస్తుందని, కాబట్టి మేజిస్ట్రేట్ నుంచి ముందుగా అనుమతి తీసుకోవడం తప్పనిసరి తెలిపింది. ఇలాంటి కేసుల్లో పోలీసులు యాంత్రికంగా కేసు నమోదు చేయడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. పోలీసులు నేరుగా కేసు నమోదు చేస్తే అది చట్ట దుర్వినియోగం అవుతుందని పేర్కొంది. గనులు, ఖనిజాల చట్టం కింద నమోదైన నేరాల్లో ప్రభుత్వం నియమించిన అధికారి రాతపూర్వక ఫిర్యాదు మేరకు మాత్రమే కేసును సంబంధిత కోర్టు పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని వివరించింది. పోలీసుల చార్జిషీట్ ఆధారంగా కేసును కాగ్నిజబుల్ కింద తీసుకునేందుకు చట్టంలో అనుమతి లేదని వెల్లడించింది. రషీదుల్లా అనే వ్యక్తిపై కర్నూలు జిల్లాలోని సి.బెళగల్ పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేస్తూ కర్నూలు మొదటి తరగతి జుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప ఇటీవల తీర్పు చెప్పారు. ప్రభుత్వం నియమించిన అధికారి రాతపూర్వకంగా ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం ముందుకు వెళ్లేందుకు ఈ తీర్పు అడ్డం కాదన్నారు. ఎమ్మిగనూరుకు చెందిన రషీదుల్లా ట్రాక్టర్లో ఇసుక తరలిస్తూ పట్టుబడితే, సి. బెళగల్ పోలీసులు రషీదుల్లా మరికొందరిపై కేసు నమోదు చేశారు. కర్నూలు మొదటి తరగతి జుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో చార్జిషీట్ ను కొట్టేయాలంటూ దాఖలు చేసిన పిటీషన్‌లో హైకోర్టు తీర్పు వెలువరించింది.

**ప్రభుత్వ ఆస్తులు ఒకరిద్దరు చేతుల్లో ఉండటం సరికాదు : హైకోర్టు**

ప్రభుత్వ వనరులు లేదా ఆస్తులు కేవలం ఒకరిద్దరి చేతుల్లో ఉండటానికి వీల్లేదని హైకోర్టు స్పష్టం చేసింది. గుత్తాధిపత్యం అంతిమంగా వ్యక్తిగత ప్రయోజనాలకు దారి తీస్తుందని హెచ్చరించింది. ఒకే వ్యక్తికే పలు ఓపెన్ స్పేస్లు ఇవ్వడం సరికాదని ఆర్‌టిసి యాజమాన్యానికి తేల్చి చెప్పింది. ఒకే వ్యక్తి పలు ఓపెన్ స్పేస్లు పొంది, వాటిని సబ్ లీజుకి ఇచ్చి వ్యక్తిగత ప్రయోజనం పొందారని తేల్చింది. టెండర్, లైసెన్స్ నిబంధనలను దుర్వినియోగం చేశారని తప్పు పట్టింది. ఇకపై కొత్తగా ఇచ్చే టెండర్లలో ఒక వ్యక్తి కేవలం ఒకే లైసెన్స్ లేదా ఒకే స్థలం కోసం మాత్రమే బిడ్ వేసేలా నిబంధన రూపొందించాలని ఆర్‌టిసిని ఆదేశించింది. కడప రీజియన్, ఎర్రగుంట్ల బస్టాండ్లో ఓపెన్ స్పేస్ల కేటాయింపు కోసం ఆర్‌టిసి యాజమాన్యం 2024 జనవరి 4న జారీ చేసిన టెండర్ నోటిఫికేషనన్ రద్దు చేసింది. ఆ టెండర్ ప్రక్రియలో పాల్గని డబ్బులు కట్టిన వారందరికీ, పిటిషనర్లకు డిపాజిట్లను 3 వారాల్లోగా తిరిగి చెల్లించాలని జస్టిస్ గన్నమనేని రామకఅష్ణ ప్రసాద్ ఇటీవల తీర్పు వెలువరించారు.



## కవయిత్రి ఇందిరా

# ధనరాజ్‌గిర్ మృతి

- సాహితీ లోకానికి తీరని లోటు
- డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

**అమరావతి– సూర్య వాస్తవం**

ప్రఖ్యాత కవి గుంటూరు శేషేంద్ర శర్మ సతీమణి కవయిత్రి ఇందిరా ధనరాజ్‌గిర్ తుది శ్వాస విడిచారని తెలిసి తాను చింతిస్తున్నానని, ఆమె మృతి సాహితీలోకానికి తీరని లోటని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హిందీ, ఉర్దూ, ఇంగ్లీషు భాషల్లో పాండిత్యం సంపాదించిన ఇందిరా ధనరాజ్‌గిర్ చేసిన సాహితీసేవ విలువైనదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో హిందీ అకాడమీకి మొదటిఅధ్యక్షురాలిగా బాధ్యతలు నిర్వర్తించారు. మనదేశం నుంచి నోబెల్‌కు నామినేట్ అయిన తొలి కవయిత్రిగా గుర్తింపు పొందారు. గుంటూరు శేషేంద్ర శర్మ సతీమణిగా ఆయన సాహితీ యాత్రలో ఇందిరా పాత్ర చిరస్మరణీయమైనదన్నారు. శ్రీ శేషేంద్ర రాసిన వేలాది ఉత్తరాలతో ప్రత్యేక గ్యాలరీ నిర్వహించారు.

## ఏపీలో ఆరోగ్య రంగానికి

# రూ. 567 కోట్లు విడుదల

- 15వ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు ఏపీకి నిధులు విడుదల చేసిన కేంద్రం
- నిధుల వినియోగం పెరగడం పట్ల కేంద్రం సంతృప్తిని వ్యక్తం చేసిందన్న సత్యకుమార్
- మిగులు నిధుల కోసం కేంద్ర ఆర్థిక శాఖతో చర్చలు ప్రారంభించాలని అధికారులకు ఆదేశం

**అమరావతి– సూర్య వాస్తవం**



ఏపీలోని ఎన్డీయే ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. ఆరోగ్య రంగానికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు ఆఖరి విడతగా రూ. 567 కోట్ల గ్రాంటును కేంద్రం విడుదల చేసింది. ఈ విషయాన్ని ఏపీ ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఈ సందర్భంగా సత్యకుమార్ మాట్లాడుతూ... గత 19 నెలల కాలంలో 15వ ఆర్థిక సంఘం నిధుల్లో 48 శాతం మేర నిధులను వినియోగించడం జరిగిందని తెలిపారు. ఏపీలోని కూటమి ప్రభుత్వంలో నిధుల వినియోగం పెరగడం పట్ల కేంద్ర ప్రభుత్వం సంతృప్తిని వ్యక్తం చేసిందని చెప్పారు. ఇది, ఏపీ ప్రభుత్వానికి కేంద్రం గుర్తింపును ఇచ్చినట్టేనని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ఆరోగ్య రంగం మరింత బలోపేతం కావడానికి ఈ నిధులు ఉపయోగపడతాయని మంత్రి చెప్పారు. రాష్ట్రానికి రావాల్సిన మిగుల నిధుల కోసం కేంద్ర ఆర్థిక శాఖతో వెంటనే చర్చలు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. కేంద్రం నుంచి అన్ని రకాలుగా, పూర్తి స్థాయిలో ఆర్థిక సాయాన్ని సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రుల బలోపేతం, ఆరోగ్య మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులను పూర్తిగా పొందిన మూడవ రాష్ట్రంగా ఏపీ అవతరించిందని చెప్పారు.

## మాటిచ్చారు.....
# నిలబెట్టుకున్నారు

### - కూటమి ప్రభుత్వానికి, డీజీపీకీ పోలీసుల తరపున కృతజ్ఞతలు తెలియజేసిన తలారి పెద్దయ్య




**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం:** శాంతి భద్రతలను సంరక్షిస్తూ, ప్రజల జీవితాలకు, ఆస్తులకూ రక్షణ కల్పిస్తూ, నేరాలు, విధ్వంసాలూ జరక్కుండా కాపాడేందుకు ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన వ్యవస్థ.... అటువంటి వ్యవస్థకు సరైన సమయంలో సరెండర్స్ ప్రోత్సాహకలు అందక అవస్థలు పడ్డారని.... కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని పండుగ వేళ విడతలవారీగా సగం సరెండర్స్, డి. ఏ ఏరియర్స్ జమ చేస్తున్న సందర్భంగా ఏపీ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఈసీ మెంబర్, 14వ బెటాలియన్ పోలీస్ ప్రెసిడెంట్ తలారి పెద్దయ్య రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, హెూం శాఖ మంత్రి వంగలపూడి అనిత, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. బుధవారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ...పోలీస్ ఉద్యోగం అంటే కత్తిమీద సాములాంటిది. ఎప్పుడు ఏ ఉపద్రవం వస్తుందోనని నిత్యం అలర్ట్‌గా ఉండాలి. ఇతర ఉద్యోగుల మాదిరిగా వీరికి పండగలు, ఆదివారం సెలవులు ఉండవు. నెలలో 30 రోజులూ డ్యూటీలో ఉండాల్సిందేనని గత ప్రభుత్వంలో సరెండర్స్ విడుదల చేస్తారని ఆశతో ఎదురు చూశారని ఎన్ని ప్రయత్నాలు చేసిన ఫలించ లేదన్నరు... దాంతో కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వమైనా వీటిని మంజూరు చేస్తుందన్న ఆశతో పోలీసులు ఎదురు చూశారని... సంక్రాంతి పండుగ రోజున దఫాల వారీగా సరెండర్స్ జమ చేశారని అయన సంతోషం వ్యక్తం చేశారు. పోలీసుల సంక్షేమానికి కృషి చేయాలని ప్రభుత్వానికి, డిజిపి కీ తలారి పెద్దయ్య విజ్ఞప్తి చేశారు

## రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

### - పీసీసీ జనరల్ సెక్రెటరీ ఎస్. అల్లాబకష్ (సీఎల్పీ)



**రాయచోటి–సూర్య వాస్తవం:** ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రెటరీ ఎస్.అల్లాబకష్ సీఎల్పీ) తెలుగు ప్రజలకు, మరియు ప్రత్యేకంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు కార్యకర్తలకు బుధవారం సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. రాయచోటి పట్టణంలోని తన స్వగృహంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రతి ఇల్లు సిరిసంపదలు, పాడిపంటలతో తులతూగాలని, రాష్ట్ర ప్రజలు నిత్యం సుఖశాంతులతో విలసిల్లాలని ఆయన ఆకాంక్షించారు. బంధుమిత్రులతో కలిసి సంక్రాంతి సంబరాలను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. పండగ సందర్భంగా రాష్ట్ర, జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులకు ఆయన ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.

## సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపిన ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల బార్ వాకర్స్

**అనంతపురం – సూర్య వాస్తవం:** సంక్రాంతి పండుగ సందర్భంగా వాకర్స్‌కు శుభాకాంక్షలు తెలిపారు అనంతపురం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల గ్రౌండ్ బార్ వాకర్స్. ఈ సందర్భంగా వాకర్స్ ప్రసాద్, నరసప్ప, రామ కృష్ణ (ఆర్.కే), శీనా, భాస్కర్, శేఖర్, శ్రీరామ్, అది, నాని, జయకుమార్, ఫణి,నవీన్, సులేమాన్, పరదేశీ, అనిల్ మాట్లాడుతూ..... భోగభాగ్యాలనిచ్చే భోగి కొత్త వెలుగులు నింపే సంక్రాంతి పండుగలను ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు. ఈ పండుగ అందరి జీవితంలో కొత్త వెలుగులు నింపాలని ఆరోగ్యంతో, ఆనందంతో ఉండాలని వారు కోరారు.

## కేంద్ర మంత్రి నివాసంలో
## పొంగల్ వండిన ప్రధాని నరేంద్ర మోదీ

### - కేంద్ర మంత్రి మురుగన్ నివాసంలో పొంగల్ వేడుకలు
### - ప్రపంచవ్యాప్తంగా తమిళులకు శుభాకాంక్షలు తెలిపిన మోదీ
### - తమిళనాడు సాంస్కృతిక వారసత్వాన్ని ప్రశంసించిన మోదీ

**న్యూఢిల్లీ– సూర్య వాస్తవం**



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పొంగల్ వంటకం తయారు చేశారు. ఢిల్లీలోని కేంద్ర మంత్రి మురుగన్ నివాసంలో జరిగిన పొంగల్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ తొలుత పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పొంగల్ వండి, గోవులకు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, రామ్మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు. పొంగల్ పండుగ సందర్భంగా తమిళనాడు ప్రజలకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమిళులకు మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ రాష్ట్ర రైతులను, తమిళనాడు సాంస్కృతిక వారసత్వాన్ని ప్రశంసించారు. పొంగల్ పండుగ తమిళుల గొప్ప సంప్రదాయానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. "ప్రియమైన భారతీయులారా, వణక్కం. పొంగల్ సందర్భంగా మీకు, మీ కుటుంబ సభ్యులకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను" అని మోదీ తన సందేశంలో పేర్కొన్నారు.

# మకర సంక్రాంతి - పంటల పండుగ...

### - నేడు సంక్రాంతి పండుగ






**సింహాద్రిపురం – సూర్య వాస్తవం :** మకర సంక్రాంతి యొక్క ప్రాముఖ్యత ఏమిటంటే ఈ రోజు 'గ్రహ రాశి'లో, అంటే సూర్యుడి చుట్టూ భూమి తిరిగే కక్ష్యలో ఒక ముఖ్యమైన కదలిక, అంటే మార్పు ఉంటుంది. ఈ మార్పు మనం ఈ గ్రహాన్ని అనుభూతి చెందే విధానంలో ఒక కొత్త మార్పుని తీసుకువస్తుంది. ఒక సంవత్సరంలో ఎన్నో సంక్రాంతులు ఉంటాయి; వీటిలోని రెండు ముఖ్యమైనవి. వాటిలో ఒకటి మకర సంక్రాంతి, రెండవది దీనికి సరిగ్గా ఆరు నెలల కాలంలో, వేసవి కాలపు ఆయనం తర్వాత వచ్చే కర్క సంక్రాంతి. ఈ రెంటి మధ్యా చాలా సంక్రాంతులు ఉన్నాయి.. రాశి మారిన ప్రతిసారి దాన్ని సంక్రాంతి అనే అంటారు. ఎందుకంటే అది గ్రహగమనంలో మార్పుని సూచిస్తుంది. ఈ మార్పు కారణంగానే మన జీవితాల పాలన, పోషణలు జరుగుతున్నాయని అర్థం చేసుకోవాలని సంక్రాంతి తెలియజేస్తుంది. ఈ కదలిక లేదా మార్పు ఆగిపోతే 'మనం' అనేది కూడా ఆగిపోతుంది. 22డిసెంబరు రోజున శీతకాలపు ఆయనం వచ్చింది, అంటే సూర్యుని పరంగా చూస్తే ఈ గ్రహం యొక్క వంపు గరిష్టస్థాయికి చేరింది. ఈ రోజు నుంచి ఉత్తర గమనం చాలా బలంగా ఉంటుంది. భూమి మీద అన్నీ మారటం మొదలు పెడతాయి. మకర సంక్రాంతి నుంచి శీతాకాలం కొద్ది కొద్దిగా తగ్గుముఖం పడుతుంది.

**పంటల పండుగ సంక్రాంతి!**

మకర సంక్రాంతి 'పంటకోతల లేదా పంట నూర్పిడుల' పండుగగా కూడా పిలువబడుతుంది. ఎందుకంటే ఈ సమయానికల్లా పంట నూర్పిడులు అయిపోయి, ప్రజలు పెద్ద ఉత్సవాలు జరుపుకుంటారు. ఈ రోజున, పంటలలో వారికి సహాయపడిన వారికి కృతజ్ఞత తెలుపుతారు. పంటలలో పశువులు చాలా పెద్ద పాత్ర పోషిస్తాయి. అందువల్ల పండుగ తరువాతి రోజు వాటి కోసమే, అదే 'కనుమ' పండుగ అని పిలువబడుతుంది. మొదటి రోజు భూమికి, రెండొవ రోజు మనకు, మూడవ రోజు పాడి పశువులకు. అవి మనకంటే ఉన్నత స్థాయిలో ఉంచబడ్డాయి. ఎందుకంటే వాటివల్లే మనం జీవిస్తూ ఉన్నాము, మన వల్ల అవి జీవిస్తూ లేవు. మనము ఇక్కడ లేకపోతే అవన్నీ స్వతంత్రంగా, సంతోషంగా ఉంటాయి. కానీ అవి లేకపోతే మనము జీవించలేము. ఈ పండుగలనేవి మన వర్తమాన, భవిష్యత్తులను స్పృహతో మలచుకోవాలి అనే దాన్ని గుర్తుచేస్తాయి. ఇప్పుడు మనం గత సంవత్సరపు పంటను కోసుకున్నాము. తరువాత పంటను సృష్టించడానికి కావలిసిన ప్రణాళికను స్పృహతో, జంతువులను కూడా పరిగణనలోకి తీసుకుని సిద్ధం చేయాలి. అందువల్ల ఈ మకర సంక్రాంతి పండుగ 'పంటల పండుగ' అయ్యింది. కానీ దీనికి ఖగోళ పరమైన, ఆధ్యాత్మిక పరమైన అర్థాలు కూడా ఉన్నాయి. ఒక నిర్దిష్ట యోగ ప్రక్రియ నుంచి ఈ పండగ ఆవిర్భవించింది, కానీ సాధారణ ప్రజలు వారికి అనువైన పద్ధతుల్లో దీనిని జరుపుకుంటున్నారు. యోగులు కొత్తగా, నూతనోత్తేజంతో తమ ఆధ్యాత్మిక ప్రక్రియను కొనసాగించడానికి ఈ సమయం చాలా ముఖ్యమైనది. అలాగే సంసారిక జీవనంలో ఉన్నవారు కూడా తాము అనుకున్నవి సాధించడానికి ఒక సరికొత్త ప్రయత్నం చేస్తారు. భూమి సూర్యుని చుట్టూ 27 నక్షత్రాల లేదా 108పాదాల పరిభ్రమణ పూర్తిచేసి, కొత్త ఆవృతాన్ని మొదలు పెట్టటాన్ని ఈ సంక్రాంతి తెలియజేస్తుంది.

'మనం' అనేదంతా ఈ గ్రహన్నుంచి తీసుకున్నదేనని మనం గుర్తుచేసుకునే రోజు ఇది. ప్రపంచంలో అందరూ ఇవ్వటం గురించి మాట్లాడడం నేను చూస్తున్నాను. వారు ఎక్కడ నుంచి తెచ్చి ఇస్తారో నాకు తెలియదు. మీరు కేవలం తీసుకోగలరు -- సౌమ్యంగా లేక దౌర్జన్యంగా తీసుకుంటారు. మీరు మీ సొంత ఆస్తిపాస్తులతో ఎక్కడి నుంచైనా వచ్చారా? ఇవ్వటానికి మీ దగ్గర ఏముంది? మీరు కేవలం తీసుకోగలరు. అన్నీ మీకు అందించబడ్డాయి. విజ్ఞతతో తీసుకోండి, మీరు చేయాల్సింది అదే. ఈ సంక్రాంతి రోజున ఈ విషయాన్ని మనం గుర్తుచేసుకోవాలి.

**మార్పుతెచ్చే పండుగ సంక్రాంతి**

మకర సంక్రాంతి అనేది భారతదేశంలో చాలా ముఖ్యమైన పండుగ. సంక్రాంతికి మూలపదమైన 'శంకర' అనే పదం యొక్క అర్థం "కదలిక". ప్రాణం అంటే కదలికే. గ్రహం కదులుతుంది కనుకే ఇది ప్రాణాన్ని పుట్టిస్తుంది. గ్రహచలనం లేకుండా ఉంటే దానికి ప్రాణాన్ని ఇచ్చే సామర్థ్యం ఉండదు. అందువల్ల ఈ కదలికలో అన్ని జీవులకూ పాత్ర ఉంది. మరి ఈ కదలిక అనేది ఒకటి ఉంటే, అది ఏదో ఒక నిశ్చలత్వం ఒడిలోనే జరుగగలదు. తమ జీవితంలోని నిశ్చలత్వాన్ని తాకలేని వారు– అంటే బాహ్యంగా, అంతర్గతంగా నిశ్చలత్వం తెలియని, చవిచూడని వారు – ఈ కదలికలో ఎక్కడో పడిపోతారు. ఈ కదలికను గుర్తుచేసుకుంటూ, కదలికే ఉత్సవం, కదలికే జీవితం, కదలికే జీవన ప్రక్రియ, కదలికే జీవితపు ఆద్యంతం అని తెలుసుకునే పండుగే మకర సంక్రాంతి. అదే సమయంలో, 'శంకర' అనే పదం వెనుక ఉన్నవాడు, శివుడు. ఆయన నిశ్చలుడు. నిశ్చలతత్వమే ఈ కదలికకు మూలం. అన్ని గ్రహాలు తిరుగుతున్నా, వాటి పరంగా చూస్తే అతి ముఖ్యుడైన సూర్యుడు తిరగటం లేదు. సూర్యుడు కూడా అలా కదిలితే మనము ఇబ్బందుల్లో పడతాము. అతడు అక్కడే కదలకుండా ఉంటాడు. అందువల్లనే మిగిలిన వాటి గమనం జరుగుతుంది. కానీ అతని నిశ్చలతత్వం కూడా సాపేక్షమైనది. ఎందుకంటే ఈ మొత్తం సౌరమండలం కదులుతూ ఉంది, మొత్తం పాలపుంత కదులుతూ ఉంది. కాని వీట్టనిటినీ పట్టి ఉంచే ఆకాశము సంపూర్ణ నిశ్చలమైనది. ఒక మనిషి తనలోని ఈ నిశ్చలత్వాన్ని తాకటానికి తగినంత ప్రయత్నం చేసినప్పుడు మాత్రమే, ఈ కదలిక యొక్క ఆనందాన్ని తెలుసుకోగలడు. లేకపోతే అందరూ ఈ జీవితంలోని కదలికను చూసి భయపడేవారే. వారి జీవితంలో వచ్చే ప్రతి చిన్న మార్పుకు, అంటే కదలికకు వారు బాధపడతారు. ఈ రోజుల్లో, మన అనుకునే ఈ ఆధునిక జీవితంలో పరిస్థితి ఇలానే ఉంది -- ఏ మార్పు వచ్చినా, మనం బాధపడడమే జరుగుతుంది. బాల్యమంతా ఆందోళన, యవ్వనమంతా పెద్ద అవస్థ, నడివయస్సు భరించలేనిది, వృద్ధాప్యం అంటే భయం, మరి మరణమంటే ఒక పండుగా?-- కానే కాదు! అదొక భీతి. జీవితంలోని ప్రతీ దశ ఒక ఇబ్బందే. ఈ జీవితపు స్వభావమే కదలికని అర్థం చేసుకోలేని వారికే కదలికతో, అంటే మార్పుతో ఇబ్బంది.

మీరు ఈ కదలికని ఆనందించగలిగేది మీరు నిశ్చలంగా ఉన్నప్పుడే. మీకు నిశ్చలత్వం అంటే ఏమిటో తెలిస్తే, అప్పుడు కదలిక అనేది ఆహ్లాదభరితం అవుతుంది. మీకు నిశ్చలత్వం అంటే ఏమిటో తెలియకపోతే, కదలిక అనేది నిశ్చేష్టతకు కారణమవుతుంది మార్పును, అంటే కదలికను పండుగగా జరుపుకోవటం మీరు మీ నిశ్చలతత్వాన్ని చవిచూసినప్పుడు మాత్రమే వీలవుతుంది అని గుర్తుచేసుకోవటమే ఈ మకర సంక్రాతి యొక్క ప్రాముఖ్యత.

# సంక్రాంతి పండుగ విశిష్టత

- రంగు రంగుల రంగవల్లులు..
- నవ ధాన్యాలు.. గొబ్బెమ్మలు..
- గాలి పటాల రెపరెపలు..
- గంగిరెద్దుల విన్యాసాలు..
- హరిదాసు సంకీర్తనలు..
- యువత కోలాటాల సందడి
- సంప్రదాయాల సంబరాలు






**పులివెందుల– సూర్య వాస్తవం**

రంగు రంగుల రంగవల్లులు నవ ధాన్యాలు గొబ్బెమ్మలు భోగి మంటలు గాలి పటాల రెపరెపలు గంగిరెద్దుల విన్యాసాలు హరిదాసు సంకీర్తనలు.. యువత కోలాటాల సందడి ఒకటేమిటి ఎన్నో సంప్రదాయాల మేళవింపుగా సంబరాలు అంబరాన్నంటేలా జరుపుకొంటారు. సన్నాయి మేళాలు బసవన్నల తాళాలు పాల పొంగళు రేగుపండ్లు ఆకట్టుకునే గొబ్బిళ్లు ఇంటికొచ్చే పాడి పంటలు.. నోరూరించే పిండి వంటలు.. బావా మరదళ్ల ముచ్చట్లు.. సంతోషాల్ని పంచుకునే కొత్త జంటలు.. చిన్నారుల చిరునవ్వులు వెరసి మూడు రోజుల సంబురాలకు వేదికగా మారే సంక్రాంతి పండుగ తెలుగింట చేసే సందడి అంతా ఇంతా కాదు. పండుగలు మన జీవన విధానానికి జీవన ప్రతీకలు. అన్ని పండుగల్లోకెల్లా సంక్రాంతికి ఎంతో విశిష్టత ఉంది. సంక్రాంతి అంటే మేలైన అభ్యుదయం అని అర్థం. కులమతాలకు అతీతంగా అందరూ ఎంతో వేడుకగా జరుపుకొనే పర్వదినం ఇది. పంటలు చేతికి వచ్చి నూతన ధాన్యంతో పొంగలి వండి దేవునికి నైవేద్యం పెట్టి పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని రైతు కుటుంబాలు ప్రత్యేక పూజలు చేస్తాయి. యువత గాలి పటాల సయ్యాటలు, రంగుల రంగవల్లికలను తీర్చిదిద్దే తెలుగింటి ఆడపడచుల ఆనందోత్సాహమే ఈ సంక్రాంతి వేడుక. పుడమితల్లికి నమస్కరించే ఉత్సవంగా ఈ పండుగను జరుపుకొంటారు.

**మకర సంక్రమణం..:** సూర్యుడు ఒక్కో నెలలో ఒక్కో రాశిలోకి ప్రవేశిస్తాడు. జనవరిలో సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించిన రోజునే మకర సంక్రమణం అంటారు. అందుకే ఈ రోజున వచ్చే పండుగను మకర సంక్రాంతిగా పిలుస్తారు. పితృ దేవతలకు ఈ రోజున తర్పణాలు సమర్పిస్తారు. పండుగ సమయానికి కొత్త ధాన్యం ఇంటికి చేరడంతో పాటు చేతి నిండా డబ్బు కూడా అందుబాటులో ఉండటంతో ఉత్సాహంగా వేడుకలు నిర్వహిస్తారు. ఆరుగాలం శ్రమించిన రైతులు సేదతీరి ఆనందోత్సాహాలతో గడుపుతారు. కొత్త దుస్తులు, కొత్త ధాన్యం, చలి గాలులతో కలిగే నూతనోత్తేజం ఇలా అన్నింటి కలయిక ఉండటంతో భోగితో ప్రారంభమై కనుమతో వేడుకలు ముగుస్తాయి.

**ముగ్గులతో వ్యాయామం..:** పండుగకు పది రోజుల ముందు నుంచే వాకిళ్లలో రంగు రంగుల ముగ్గులను అలంకరిస్తాం. చుక్క చుక్కను కలిపే ముగ్గుల గీతలు వరుసలను కలుపుతాయి.

చుక్కల ముగ్గు అంటేనే అందరు కలిసి ఉండటమనే అర్థాన్ని ఇస్తుంది. వసుధైక కుటుంబంగా ఆదర్శ జీవితాన్ని గడపడమే ముగ్గుల్లో దాగి ఉన్న పరమార్థం. ముగ్గు వేసేందుకు వాడే పొడి సూక్ష్మజీవులను నశింపజేస్తుంది. బియ్యం పిండితో ముగ్గు వేయడం వల్ల పక్షులు, చీమలకు ఆహారంగా ఉపయోగ పడుతుంది. ముగ్గుల అలంకరణలో శాస్త్రీయత ఇమిడి ఉంది. ఎంతో పవిత్రమైన ధనుర్మాసంలో తెల్లవారు జామున ముగ్గులు వేసే సమయంలో వంగటం, కూర్చోవటం వల్ల వ్యాయామం చేసిన ఫలితం దక్కుతుంది.

# సంక్రాంతి పండుగను ప్రతి ఒక్కరూ సంతోషంగా జరుపుకోవాలి

**- వృషభాచలేశ్వర దేవస్థాన కమిటీ మాజీ చైర్మన్ సింగారెడ్డి జయచంద్రారెడ్డి**



**వేంపల్లె - సూర్య వాస్తవం :** వేంపల్లి పట్టణ ప్రజలందరూ సంక్రాంతి పండుగను సంతోషంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో జరుపుకోవాలని వృషభాచలేశ్వర దేవస్థాన కమిటీ మాజీ చైర్మన్ సింగారెడ్డి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ, సంక్రాంతి అనేది తెలుగు ప్రజల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, కుటుంబ సభ్యులంతా ఒక్కచోట చేరి ఆనందంగా గడిపే పండుగ అని అన్నారు. ఈ పండుగ సందర్భంగా ప్రతి ఇంటిలో శాంతి, సౌఖ్యం, సమృద్ధి నిండాలని ఆయన ఆకాంక్షించారు. రైతులకు మంచి పంటలు పండాలని, వ్యాపారులు, కార్మికులు, ఉద్యోగులు అందరూ అభివృద్ధి బాటలో సాగాలని కోరారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి, సంప్రదాయ క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. అదేవిధంగా ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ ప్రమాదాలకు దూరంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు శాంతియుతంగా నిర్వహించాలని సూచించారు. చివరగా వేంపల్లి పట్టణ ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ పండుగ ప్రతి కుటుంబానికి ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం తీసుకురావాలని సింగారెడ్డి జయచంద్రారెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు సింగారెడ్డి సాయి కృష్ణా రెడ్డి, శివశంకర్ రెడ్డి (చిన్న) పాల్గొన్నారు.

# సంక్రాంతి ప్రతి ఇంటా ఆనందాన్ని నింపాలి

**- మండల వైసీపీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి**



**సింహాద్రిపురం- సూర్య వాస్తవం :** సంబరాల సంక్రాంతి ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులు నింపాలని, భోగ భాగ్యాలిచ్చే భోగి, సరదాలిచ్చే సంక్రాంతి, కమ్మని కనుమ కొత్త సంవత్సరంలో వెలుగులు నింపాలని తెలుగు వారందరికీ సింహాద్రి పురం మండల వైకాపా అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ తెలుగుదనాన్ని లోకమంతా చాటుతూ మన సాంప్రదా యాన్ని విశ్వమంతా తెలుపుతూ సంక్రాంతి పండుగ జరుపుకోవడం ఆనందాన్నిచ్చే సంక్రాంతి పండుగ అని, పాడిపంటలతో పచ్చని పైరులతో సస్యశ్యామలం కావాలని ప్రతి రైతు ఇంట సంతోషాలు వెల్లి విరియాలని, ఈ సంక్రాంతి ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, అందరికీ భోగభాగ్యాలను ఇచ్చే భోగి, సరదాలు తెచ్చే సంక్రాంతి, ఇప్పటినుండి కొత్తగా, సరికొత్తగా మరింత ఆనందాన్ని పంచాలని కోరుకుంటూ సింహాద్రిపురం మండల వైకాపా ప్రజా ప్రతినిధులకు అధికారులకు ప్రజలకు అభిమానులకు శ్రేయోభిలాషులకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

# సంబరాల సంక్రాంతి ముగ్గుల పోటీలు






**సింహాద్రిపురం- సూర్య వాస్తవం :** సింహాద్రిపురం శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయం ఆవరణలో బుదవారంమహిళలు కు ముగ్గులపోటీలు నిర్వహించారు. సంక్రాంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ పోటీల్లో 48 మంది మహిళలు పాల్గొని అందమైన రంగ వల్లులుతీర్చి దిద్దారు. కాగా మహిళలు సంక్రాంతి ఔ నత్యాన్ని ఈ ముగ్గులు ద్వారా వెలికి తీశారు. న్యాయ నిర్ణేతగా విశ్రాంత ప్రిన్సిపల్ సదాశివారెడ్డి వ్యవహరించారు. మొదటి బహుమతి క్రింద శ్వేత, 2వ బహుమతి అమృత, 3వ బహుమతి అరుణ, 4వ బహుమతి మౌనిక, 5వ బహుమతి హరి ప్రియ కైవసం చేసుకున్నారు. కాగా 6వ బహుమతి క్రింద 9 మందికి బహుమతులను ప్రదానం చేసారు. పోటీల్లో పాల్గొన్న మిగతా 34 మహిళలకు హాట్ బాక్సులను ప్రదానం చేసారు. ఆలయకమిటీఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించారు. కార్య క్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపల్ సదాశివారెడ్డి ఆలయకమిటీ సభ్యులు మహేశ్వర రెడ్డి,జయరామిరెడ్డి ఉసేన్ పీరా,కమలనాథరెడ్డి బాబా కిశోర్, సాంబశివారెడ్డి, లక్ష్మీ నారాయణరెడ్డి , వెంగళరెడ్డి ఓబులరెడ్డి తది తరులు పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణ రద్దు చేయాలి

**- భోగిమంటలతో నిరసన**
**- భారత కమ్యూనిస్టు పార్టీ సభ్యులు**




**పులివెందుల - సూర్య వాస్తవం :** మెడికల్ కాలేజీ పీపీపి విధానాన్ని రద్దు చేయాలని పులివెందుల నియోజకవర్గం భారత కమ్యూనిస్టు సిపిఐ పులివెందుల మెడికల్ కాలేజ్ దగ్గర ఆందోళన చేపట్టారు. బుధవారం పులివెందుల నియోజకవర్గం పులివెందుల మెడికల్ కాలేజ్ దగ్గర రాష్ట్ర పిలుపు మేరకు ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ రద్దు చేయాలని జీవో నెంబర్ 107.108. 590లను భోగిమంటల్లో వేసి దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సమితి సభ్యుడు బుర్రి ఈశ్వరయ్య సింహాద్రిపురం మండల కార్యదర్శి అమీర్ భాష మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎన్నికలలో హామీ ఇచ్చి మాట తప్పిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పేదలకు వైద్య విద్య దూరం ప్రజారోగ్యానికి ముప్పు వైద్య విద్యకు శాపంగా మారిన జీవో నెంబర్ 107 108 590 రద్దు చేయాలి మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ జీవోలను భోగి మంటల్లో దగ్ధం చేసి పేదలకు వైద్య విద్యను దూరం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పైన మండిపడ్డారు. ప్రతిపక్షంలో వైఎస్ఆర్సిపి ప్రభుత్వం వైద్య విద్యకు పేదలకు దూరం చేసే పద్ధతుల్లో 107 108 జీవోలను తీసుకువచ్చి వైద్య విద్యను 80శాతం ప్రైవేటీకరణ చేస్తే అప్పటిలో ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం పార్టీ గగ్గోలు పెట్టి పేదలకు వైద్య విద్యను దూరం చేస్తున్న వైఎస్ఆర్సిపి ప్రభుత్వాన్ని గద్దె దించాలని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే వంద రోజుల్లో 107 108 జీవోలను రద్దు చేస్తామని హామీ ఇచ్చి నేడు అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర పూర్తవుతున్నప్పటికీ ఇచ్చిన హామీలలో భాగంగా జీవోలను రద్దు చేయకపోగా 100% వైద్య విద్యను పిపిపి విధానంలో ప్రైవేటీకరణ చేస్తున్నారని మండిపడ్డారు. పిపిపి విధానం వల్ల కేవలం వైద్య విద్యార్థుల నష్టపోవడంతో పాటు సామాన్య ప్రజలు వైద్యం ఉచితంగా చేపించుకోవాల్సినటువంటి పరిస్థితి ఉండదన్నారు. వైద్య కళాశాల రాష్ట్రానికి వస్తే దాని పక్కనే ఒకటి ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాట అవుతుంది దానివల్ల సామాన్య ప్రజలు వైద్యం అందించుకోవడానికి అవకాశం ఉంటుంది. పిపిపి విధానం వల్ల పేదలకు విద్యతోపాటు వైద్యం కూడా దూరం చేసేటువంటి పరిస్థితి రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యార్థులు ఒకవైపు లక్షలలో ఖర్చుపెట్టి ఇంటర్ తో పాటు నీట్ శిక్షణకు విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి చదివిస్తున్నారు నీటిలో అర్హతలు సాధించిన తరువాత వారికి పిపిపి విధానం వల్ల రాష్ట్రంలో ఎంబిబిఎస్ సీట్లు అందుబాటులో లేకుండా పోతాయని మండిపడ్డారు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఉండాల్సిన వైద్య విద్యను లాభాల కేంద్రంగా మార్చే ప్రయత్నం పిపిపీ విధానమని పేర్కొన్నారు. రాష్ట్రంలో జీవో నెంబర్ 590 ద్వారా 107.108 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పిపిపి పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించడంతో పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలో కొనసాగాల్సిన ఈ వైద్య కళాశాలలను ప్రైవేట్ భాగ్యసామికే అప్పగించడం ప్రభుత్వ భూములు భవనాలు మౌలిక సదుపాయాలు ఆసుపత్రులు దీర్ఘకాలం పాటు ప్రైవేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పిపిపీ విధానంలో యాజమాన్య కోటాలో సీట్లకు భారీ ఫీజులు విధించే అవకాశం ఉందని దీనివల్ల పేద మధ్య తరగతి విద్యార్థులు వైద్య విద్యకు దూరం అవుతుందని తెలిపారు, వైద్య విద్య సీట్లు పెరుగుతాయన్న ప్రభుత్వ హామీలు అపద్ధపు మాటలేనని విమర్శలు చేశారు, దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రైవేటీ కరణను వేగవంతం చేసినట్లే రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం కూడా అదే దారిలో నడుస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ వైద్య విద్యకు శాపంగా మారిన జీవో నెంబర్ 107 108 590 రద్దు చేయాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటాలకు నాంది పలుకుతామని. ఈ జీవోలను వెంటనే రద్దు చేయాలని భోగి మంటలలో వేసి దగ్నం చేసామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆకుల అంకన్న, అనిల్ సురేష్, రాజా, ఈశ్వరయ్య, రమణయ్య, కృష్ణకుమారు, తదితరులు పాల్గొన్నారు.

# భోగి సంబరాలలో ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి

**- జిల్లా ప్రజలకు భోగి, మకర సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలియజేసిన ఎంపీ**





**పులివెందుల - సూర్య వాస్తవం :** సంక్రాంతి సంబరాలలో మొదటిదైన భోగి సంబరాలలో జిల్లా ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పాల్గొని, జిల్లా ప్రజలకు వైకాపా పార్టీ నాయకులకు శ్రేణులకు భోగి, మకర సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలియజేశారు. బుధవారం భోగి పండుగతో సంక్రాంతి సంబరాలు మొదలుకాగా రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ మొదటి రోజు భోగి వేడుకల సంబరాలు అంబరాన్ని అంటగా మీకు జామున భోగి మంటల చుట్టూ చేరి ఆడి పాడి ప్రజల ఆనంద లోకంలో విహరించారు. సాధారణ ప్రజల నుండి ప్రముఖుల వరకు భోగి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు, వాటిలో భాగంగానే పులి వెందులలోని జిల్లా ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఇంటి ఆవరణ నందు భోగి సంబరాలలో భాగంగా భోగి మంటలను వేసి హరిదాసులతో కాలక్షేపం చేసిన ఎంపీ అవినాష్ రెడ్డి భోగి మంటలలో భాగంగా మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తూ ప్రభుత్వ జీవో కాపీలను భోగిమంటల్లో వేశారు. ఈ సందర్భంగా ఎంపీ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ తెలుగువారి సాంప్రదాయాల సంరక్షిస్తున్నటువంటి పండుగ సంక్రాంతి అని, ఈ ఏడాది రైతులకు పాడిపంటలు సుభిక్షంగా పండాలని, రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలని, అందరి కష్టాలు తొలగిపోవాలని ఆ భగవంతున్ని మనసారా ప్రార్థిస్తున్నానని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, పట్టణ కన్వీనర్ హాల్ గంగాధర్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లె కిషోర్, వేముల, లింగాల మండల నాయకులు సాంబశివారెడ్డి, బాబుల్ రెడ్డి, రసూల్, భయపరెడ్డి, జస్వంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భోగిమంటల్లో కార్మిక జీవోలు దగ్ధం...





**పత్తికొండ - సూర్య వాస్తవం:** పత్తికొండ పట్టణంలో బుధవారం స్థానిక మడ్డి గేరి నందు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బుజ్జులు , సికామని, ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి చట్టాన్ని మార్చి విబి జి రాంజీ పేరున కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవోలను మరియు పట్టణంలోని స్థానిక అంబేద్కర్ సర్కిల్ నందు సిఐటియు మండల కార్యదర్శి ఎం రవిచంద్ర, ఆధ్వర్యంలో 29 చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లుగా తీసుకువచ్చిన జీవోలను భోగిమంటల్లో దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి చక్రాల వెంకటేశ్వర్ రెడ్డి, సిఐటియు మండల కార్యదర్శి ఎం. రవిచంద్ర, మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో వలసలు వెళ్లకుండా నియంత్రించాలన్న సదుద్దేశంతో వామపక్షాల ఆధ్వర్యంలో చేసిన పోరాటాల వల్ల 2005 లో మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి చట్టం రూపకల్పన చెందిందని అది కాస్త విబి జి రాంజీ పేరుతో పతకంగా మార్చడం అలాగే 29 చట్టాలను రద్దుచేసి చికాగో నగరంలో కార్మికుల రక్తంలో నుండి పుట్టిన ఎనిమిది గంటల పని విధానాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లుగా తీసుకువచ్చిన జీవోలను మాకు వద్దు అంటూ భోగిమంటల్లో కాల్చి వేయడం జరిగిందని ఇలాంటి జీవోలను కేంద్ర ప్రభుత్వం వెనక్కు తీసుకోకుంటే దేశవ్యాప్తంగా కార్మికులు కర్షకుల ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు చేపట్టడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఉరుకుందు, రామాంజనేయులు, బజారు హమాలీలు గ్రామీణ ఉపాధి హామీ పథకం మహిళలు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం వీరబాదుడు ప్రభుత్వం

## - నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లె - సూర్య వాస్తవం :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం దంచుడు ప్రభుత్వంగా, బాదుడు ప్రభుత్వంగా, వీర బాదుడు ప్రభు త్వంగా తయారు కావడం దురదృష్టకరం, శోచనీయమని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. బుధవారం వేంపల్లిలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఏరు దాటి నంతవరకు ఓడ మల్లన్న, ఏరు దాటాక బోడి మల్లన్న అనే విధంగా రాష్ట్రంలో కూటమిపాలన తయారైందని ఎద్దేవా చేశారు. వైకాపా ప్రభుత్వం దంచుడు ప్రభు త్వంగా, వీర బాదుడు ప్రభుత్వంగా తయారైందని, తాము అధికారంలోకి వస్తే చార్జీలు గాని, పనులు గాని పెంచనే పెంచమని,ఇంకా వీలైతే తగ్గిస్తామని కూటమి పార్టీలు ఎన్నికలకు ముందు ప్రజలకు హామీ ఇచ్చాయి. ప్రజలు నమ్మి ఓట్లు వేశారు.అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం ప్లేటు ఫిరాయించడం దురదృష్టకరం. కూటమి పార్టీలు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక అనేక రూపాలలో బాదుడు కార్యక్రమం చేస్తోంది.

1. విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో 15 485 కోట్ల రూపాయల అదనపు భారము విద్యుత్ వినియోగదారులపై మోపింది.
2. వాహనాలపై లైఫ్ టాక్స్ పై 10% రహదారి భద్రతా సెస్సు.
3. ఒక్కొక్క మద్యం బాటిల్ పై అదనంగా పది రూపాయలు. ఏడాదికి 1391 కోట్ల రూపాయల అదనపు భారము మందుబాబులపై.
4. ఏపీ లాటరీ ద్వారా 3000 కోట్ల రూపాయలు.
5. ఆన్లైన్ గేమింగ్ పై పన్ను ద్వారా 1400 కోట్ల రూపాయలు.
6. స్థానిక సంస్థల వినోద్ పన్ను ద్వారా 2300 కోట్ల రూపాయలు
7. రెండు, మూడు స్థాయిల్లో అమ్మకంపై వ్యాట్ ద్వారా 1300 కోట్ల రూపాయలు
8. వృత్తి పన్ను పెంపు ద్వారా 400 కోట్ల రూపాయలు.
9. ఎస్జిఎస్టిపై ఒక శాతం సెస్సు ద్వారా 4700 కోట్ల రూపాయలు.

కోడలికి బుద్ధి చెప్పి అత్తతెద్దు నాకింది అన్న సామెతను కూటమి ప్రభుత్వం జ్ఞాపకం చేస్తోంది అని తులసిరెడ్డి ఎద్దేవా చేశారు. బాదుడు కార్యక్రమం ఇలాగే కొనసాగితే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో, సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఓటు ద్వారా కూటమి ప్రభుత్వానికి బాదు డు కార్యక్రమం ద్వారా బుద్ధి చెబుతారని తులసి రెడ్డి హెచ్చరించారు.

# చదువుతో పాటు యోగాలోనూ ప్రతిభ

## - ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా




**వేంపల్లె - సూర్య వాస్తవం :** రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ ఆర్కె వ్యాలీ క్యాంపస్‌కు చెందిన విద్యార్థిని ఏ.కుమారి దక్షిణ భారత స్థాయి యోగా పోటీల్లో ప్రతిభ చూపి మూడవ స్థానాన్ని సాధించినట్లు ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా తెలిపారు. స్పోర్ట్స్ అథరిటీ ఆఫ్ ఇండియా ఖేలో ఇండియా, అస్మితా యోజన ఆధ్వ ర్యంలో హైదరాబాద్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్, నాచారం వేదికగా జనవరి 11 నుండి 13, వరకు నిర్వహించిన పోటీల్లో విద్యార్థిని పాల్గొంది. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి, అండమాన్-నికోబార్ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులతో పోటీ పడి ఈ ఘనత సాధించడం విశేషం. ఏ.కుమారి ప్రస్తుతం ఆర్జీయూకేటీ - ఆర్కె వ్యాలీ, ఐఐఐటీ ఇడుపులపాయ క్యాంపస్‌లో సివిల్ ఇంజినీ రింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ విజయంతో విద్యార్థిని కుమారి ఢిల్లీలో నిర్వహించనున్న జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపిక అయింది. చదువుతో పాటు యోగా వంటి క్రీడల్లోనూ ప్రతిభ కనబరుస్తున్న కుమారి ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందని యోగా అధ్యాపకులు సోమేపల్లి అశోక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆర్జీయూకేటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, ఏఓ రవికుమార్, డీన్ రమేశ్ ,వెంకటేష్, యోగా విభాగాధిపతి భారతి ప్రత్యేకంగా కుమారిని అభినందిస్తూ, ఆమె భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. జాతీయ స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలని వారు ప్రోత్సహించారు.

# ఉత్సాహంగా చియ్యేడు గ్రామంలో సంక్రాంతి సంబరాలు

- చియ్యేడు గ్రామస్తుల ఆధ్వర్యంలో క్రీడోత్సవాలు
- యువతకు క్రికెట్ మ్యాచ్‌లకు ఆర్థిక సాయం అందజేస్తూ ఆదర్శంగా చియ్యేడు బండి గోపాల్, జయరాములు



**అనంతపురం - సూర్య వాస్తవం :** సంక్రాంతి సంబరాల్లో భాగంగా చియ్యేడు గ్రామస్తులు ఏర్పాటుచేసిన సీజన్ 5 క్రికెట్ టోర్నమెంట్‌ను చియ్యేడు బండి గోపాల్ టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చియ్యేడు బండి గోపాల్, జయరాములు మాట్లాడుతూ.... యువత క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. క్రీడల వల్ల మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం కలుగుతాయని చెప్పారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, వాటిని క్రీడా స్ఫూర్తితో స్వీకరించాలని సూచించారు.

# గండి క్షేత్రంలో సాంస్కృతిక కార్యక్రమాలు





**వేంపల్లె - సూర్య వాస్తవం :** రాయలసీమ జిల్లాలలోనే ప్రసిద్ధి చెందిన గండి క్షేత్రం శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానం నందు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. అందులో భాగంగా రీజనల్ జాయింట్ కమిషనర్ దేవదాయ శాఖ తిరుపతి వారి ఆదేశముల మేరకు శ్రీ వీరాంజనేయ స్వామి వారి ఆలయం ప్రాంగణము నందు సాంస్కృతిక కార్యక్రమాలు బుధవారం ఉదయం 10 గంటల నుండి మహిళలతో ముగ్గుల పోటీలు, దూకుడు బిల్లా, లెమన్ అండ్ స్పూన్ ఆటలు నిర్వహించబడ్డాయి. ఈ పోటీలలో మొదటి బహుమతి డి. జోష్ణవి కడప, రెండవ బహుమతి కె. శిల్ప ఇడుపులపాయి, మూడవ బహుమతి సి.లావణ్యలు గెలుపొందారు. దేవస్థానం ప్రధాన అర్చకులు కేసరి స్వామి, ఉప ప్రధాన అర్చకులు రాజాస్వామి, దేవస్థాన మాజీ చైర్మన్ వెంకటస్వామిలు గెలుపొందిన వారికి బహుమతులు అందజేసినట్లు ఆలయ సహాయ కమీషనర్ జె.వెంకట సుబ్బయ్య తెలిపారు.

# ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తే చర్యలు తప్పవు

## - ఎస్ఐ రంగారావు




**వేంపల్లె - సూర్య వాస్తవం :** వాహనదారులు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ కచ్చితంగా పాటించాలని, అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ రంగారావు హెచ్చరించారు. మంగళవారం స్థానిక పట్టణంలోని ఆర్టిసి బస్టాండ్, తదితర ప్రాంతాల్లో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రంగారావు మాట్లాడుతూ చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని, అందుకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. మద్యం సేవించి నడపడం, మైనర్ లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమన్నారు. అలాగే సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమన్నారు. వీటి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఇంటి నుంచి బయటకు వచ్చే సందర్భాల్లో వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించి, వాహన పత్రాలు, తమ లైసెన్స్ కలిగి ఉండాలని వాహనదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సాయిబాబా, కానిస్టేబుల్ శ్రీనాథ్ రెడ్డి, నజీర్ పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ బంగ్లాలో భోగి మంటల వేడుక..!

**వైఎస్ఆర్ కడప బ్యూరో - సూర్య వాస్తవం :** మూడు రోజుల సంక్రాంతి వేడుకల్లో భాగంగా.. మంగళవారం మకర సంక్రాంతి సందర్భంగా.. బుధవారం వేకువ జామున వైఎస్ఆర్ కడప కలెక్టర్ బంగ్లాలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరు కూరి కుటుంబ సభ్యులతో కలిసి భోగి మంటలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....ఈ భోగి మంటలు ప్రతి కుటుంబంలో కొత్తదనాన్ని.. శు భశకునాలను ఉద్భవిస్తాయని.. ఆ మంటల వెచ్చటి కాంతులు ప్రతి ఒక్కరికీ నిండైన ఆరోగ్యాన్ని, ఇమ్యూనిటీ పవర్ ను అందిస్తాయని తెలిపారు.



జిల్లాలో సంక్రాంతి పండుగ సంబరాలు ఊరూరా.. ఇంటింటా.. వెల్లివిరుస్తున్నాయని తొలిరోజు భోగితో మొదలైన సంబరాలు.. మకర సంక్రాంతి, కనుమతో మూడు రోజుల పాటు కొనసాగనున్నాయన్నారు.

# ప్రత్యేక పూజల్లో మాజీ సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు





**వేంపల్లె - సూర్య వాస్తవం :** ధనుర్మాసం సందర్భంగా వేంపల్లె గ్రామ పంచాయతీ మాజీ ఇంఛార్జీ సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. బుధవారం స్థానిక శ్రీవెంకటేశ్వర స్వామి, శ్రీఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక ఆహ్వానం పలుకుతూ శాలువ, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి శోభ ప్రతి ఇంట్లో సంతరించాలి, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని ఆ భగవంతున్ని ప్రార్థించారు. అలాగే సంక్రాంతి పండుగ శు భాకాంక్షలు తెలియజేశారు.

# దీపాలంకారంలో దర్శనమిచ్చిన శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి

**వేంపల్లె - సూర్య వాస్తవం:** ధనుర్మాసం చివరి రోజు ను సందర్భంగా స్థానిక పట్టణంలోని కడప రోడ్డులో వెలసిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారిని దీపాలంకరణలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించామని ఆలయ ఈఓ సుభాష్ తెలిపారు. ఆలయ అర్చకులు తిరుమల వేణు నేతృత్వంలో తెల్లవారుజామున సూర్యోదయానికి ముందే స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన, తిరుప్పావై, కైంకర్యాలు, నక్షత్ర హారతులు, విశేష పూజలు నిర్వహించి భక్తులకు కలియుగ దైవం వెంకన్న దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఆలయ




ప్రాంగణం గోవింద నామస్మ రణంతో మారుమ్రోగింది. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి చైర్మన్ పి. వెంకటరమణ, సభ్యులు, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఓ అండ్ ఎమ్ విద్యుత్ ఉద్యోగుల డైరీ క్యాలెండర్ ఆవిష్కరించిన

## - ఎమ్మెల్యే మాధవి రెడ్డి పోలీస్ బ్యూరో సభ్యులు శ్రీనివాస్ రెడ్డి



**కడప - సూర్య వాస్తవం :** నూతన సంవత్సరం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కడప ఎమ్మెల్యే రెడ్డప్ప గారి మాధవిరెడ్డి దంపతులు బుధవారం ఓ అండ్ఎమ్ విద్యుత్ ఉద్యోగుల డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరెడ్డి ఆమె భర్త రెడ్డప్ప శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ, విద్యుత్ ఉద్యోగులు కొత్తగా ఓ అండ్ ఎం యూనియన్‌ను స్థాపించి ఉద్యోగుల భవిష్యత్ కార్యాచరణ, ఉద్యోగుల వెల్ఫేర్ పండ్, ఉద్యోగుల భద్రత భవిష్యత్తుకై ఏర్పడినటువంటి ఈ యూనియన్ అన్ని యూనియన్లకు ఆదర్శం కావాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే విద్యుత్ పనులు చేసేటప్పుడు అప్రమ త్తంగా ఉండాలని, మీరు కష్టపడితే ప్రజలందరికీ వెలుగు ఉంటుందని అలాంటిది పనిచేసే సమయంలో కచ్చితంగా జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ ఉద్యోగులు మరింత భద్రతా భావంతో పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు ఓ అండ్ ఎంవిద్యుత్ ఉద్యోగులను ఈ సందర్భంగా అభినందించి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ దొరబాబు, డిస్కమ్ సెక్రటరీ మురళి మోహన్, రీజినల్ ప్రెసిడెంట్ ప్రేమ్ చాంద్, రీజినల్ సెక్రటరీ చంద్ర ఓబుల్ రెడ్డి, రీజినల్ వర్కింగ్ ప్రెసిడెంట్ దస్తగిరి, రీజినల్ ట్రెజరర్ ప్రవీణ్ కుమార్, డిస్కమ్ సెక్రటరీ హరి ప్రసాద్, బాబు, లాజర్, సందీప్, జగదీష్, ముని కుమార్, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

# నూతన మఠాధిపతి శ్రీ వెంకటాద్రి స్వామిని సన్మానించిన తెలుగుదేశం నాయకులు

**బ్రహ్మంగారిమఠం- సూర్య వాస్తవం :** కాలజ్ఞాన ప్రబోధ కర్త శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం నూతన మఠాధిపతి శ్రీ వెంకటాద్రి స్వామిని తెలుగుదేశం నాయకులు మల్లె బాలకృష్ణ, (ఎద్దులాయి పల్లె) గురయ్య, రెడ్లదినే నాగ ఖాదరయ్య, లింగాలదిన్నె నరసింహారెడ్డి, రెడ్ల దీన్నె సురేంద్ర పూలదండ వేసి శాలువాతో సన్మానించారు. అలాగే శ్రీ వెంకటాద్రి స్వామి తమ్ముళ్లు శ్రీ వీరం బోట్లయ్య స్వామి, శ్రీ దత్తాత్రేయ స్వామి ఉన్నారు.



# రాయచోటి అస్తిత్వాన్ని కాపాడుకుందాం

- రాయచోటి జిల్లా డిమాండ్‌పై ముఖ్యమంత్రితో చర్చిస్తా
- జేఏసీ నాయకులకు హామీ ఇచ్చిన రాజంపేట టిడిపి పార్లమెంట్ అధ్యక్షుడు ప్రసాద్ బాబు



**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం:** రాయచోటి ప్రత్యేక జిల్లా సాధన కోసం జేఏసీ నాయకులు చేస్తున్న ఉద్యమంపై ముఖ్యమంత్రితో జేఏసీ నాయకుల సమక్షంలోనే చర్చించి రాయచోటికి న్యాయం జరిగేటట్టు చేస్తామని రాజంపేట టిడిపి పార్లమెంట్ అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్ బాబు అన్నారు. జేఏసీ నాయకులు బుధవారం ప్రసాద్ బాబుని కలిసి రాయచోటి ప్రత్యేక జిల్లా ఉద్యమంపై చర్చించిన అనంతరం జేఏసీ నాయకులు తయారుచేసిన 14 మండ లాలలతో కూడిన రాయచోటి జిల్లా చిత్రపటంతో సహా వినతిపత్రం ఇచ్చారు. జిల్లాల పునర్విభజన అనంతరం అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లికి తరలిపోవడం వలన రాయచోటి ప్రజల్లో ఆందోళన ఉన్న మాట వాస్తవమని ఈ విషయంపై ప్రభుత్వంపై గట్టిగా ఒత్తిడి తెచ్చి భవిష్యత్తులో రాయచోటికి న్యాయం జరిగే విధంగా జేఏసీ డిమాండ్ ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తారని అన్నారు. రాయచోటి అస్తిత్వాన్ని కాపాడటానికి ఏ విధంగానైనా సరే తాను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సాధించుకోవడానికి పనిచేస్తానని ప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షులు టి.ఈశ్వర్ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు ఉపాధ్యక్షులు జీవానందం గిరిబాబు యాదవ్ రామా శ్రీనివాస్ వీరబల్లి శ్రీనివాసులు, రమేష్ ఎంవి రమణ టీచర్ హరిబాబు, నాగార్జున ఇనాయ తుళ్ళ, జనార్ధన, చెన్న కృష్ణ సర్పంచ్ వాసు, న్యాయ వాదులు నాగ ముని, మల్లికార్జున శివకుమార్ ఉత్తేజ్ కుమార్ విద్యావంతుల వేదిక నాయకులు రెడ్డయ్య రామారావు రాయచోటి చెన్నకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# నిషేధం ఉన్నా యథేచ్ఛగా విక్రయాలు..

- అధికారుల హెచ్చరికలను లెక్కచేయని ఎరువుల అంగడి యజమాని
- రైతులను దోచుకుంటున్నారని ఆవేదన



**తొండూరు – సూర్య వాస్తవం :** తొండూరు మండలంలో అక్రమంగా ఎరువులు, పురుగుమందులు విక్రయిస్తున్న ఓ అంగడి యజమాని వ్యవసాయ శాఖ అధికారుల హెచ్చరికలను లెక్కచేయకుండా వ్యాపారం కొన సాగి స్తున్నట్లు తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేని ఉత్పత్తులను విక్రయిస్తూ రైతుల నమ్మకాన్ని దోచుకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి, సంబంధిత అంగడిలో అక్రమంగా నిల్వ ఉంచిన ఎరువులు, పురుగుమందులపై అభ్యంతరం వ్యక్తం చేశారు. “వెంటనే అమ్మకాలు నిలిపివేయాలి” అని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, ఆ అంగడి యజమాని వాటిని లెక్కచేయకుండా వ్యాపారం కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**రైతుల నమ్మకంతో చెలగాటం**

నిబంధనలకు విరుద్ధంగా, ప్రభుత్వ అనుమతులు లేని ఉత్పత్తులను విక్రయించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని రైతు పట్ల వెంకట జనార్ధన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. “పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే నాసిరకం ఎరువులు విక్రయిస్తున్నారు. వాటి వల్ల రైతులకు ఆర్థిక నష్టం జరుగుతోంది. అయినా అధికారులు కఠిన చర్యలు తీసుకోవడం లేదు” అని ఆయన మండిపడ్డారు.

**కేవలం కాగితాలకే పరిమితమైన హెచ్చరికలా?**

అధికారులు హెచ్చరికలు జారీ చేసినా, వాటిపై అమలు లేకపోవడం పట్ల ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. “ఆదేశాలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయా?” అనే ప్రశ్నలు రైతుల్లో వినిపిస్తున్నాయి. అక్రమ వ్యాపారాలపై చర్యలు తీసుకోకపోవడం వల్ల ఇతర అంగడిదారులు కూడా నిబంధనలను పట్టించుకోకుండా వ్యవహరించే పరిస్థితి ఏర్పడుతోందని విమర్శలు వస్తున్నాయి.

**పర్యవేక్షణ లోపం?**

తొండూరు మండలంలో ఎరువుల విక్రయాలపై సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఇలాంటి అక్రమాలు జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు. తనిఖీలు పేరుకే జరుగుతున్నాయా? లేకపోతే అధికారుల నిర్లక్ష్యమే కారణమా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్**

అక్రమంగా ఎరువులు, పురుగుమందులు విక్రయిస్తున్న అంగడులపై వెంటనే కేసులు నమోదు చేసి, లైసెన్సులు రద్దు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే భవిష్యత్తులో ఇలాంటి అక్రమాలు జరగకుండా కఠిన పర్యవేక్షణ చేపట్టాలని కోరుతున్నారు.రైతుల జీవితాలతో చెలగాటం ఆడే వారిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ప్రజలు స్పష్టంగా చెబుతున్నారు.

# ముగ్గులు శాస్త్రీయతకు ప్రతీక

- మఠాధిపతులు వీర శివకుమార్ స్వామి
- సంతూర్ సోప్ ఆధ్వర్యంలో ముగ్గులు పోటీలు
- అధిక సంఖ్యలో పాల్గొన్న మహిళలు



**బ్రహ్మంగారిమఠం – సూర్య వాస్తవం :** సంక్రాంతి సంబరాల్లో భాగంగా బ్రహ్మంగారిమఠంలోని జగన్మాత శ్రీ ఈశ్వరి మహాదేవి ఆలయ ప్రాంగణంలో విప్రో సంతూర్ సోప్ వారి సౌజన్యంతో మహిళలకు రంగవల్లుల పోటీ కార్య క్రమాలను నిర్వహించారు. ఈ పోటీ కార్యక్రమాలకు మండలంలోని మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మొత్తం 22 మంది సభ్యులు పాల్గొన్నారు వీరిలో మొదటి బహుమతిగా వీర రుచిత గెలుపొందగా ద్వితీయ బహుమతి దేవిరెడ్డి పద్మావతి తృతీయ బహుమతి వెంకట మేఘన సాధించారు. ఈ గెలుపొందిన విజేతలకు సంతూర్ సోపు ఆధ్వర్యంలో ఆకర్షణీయమైన బహుమతులను జగన్మాత శ్రీ ఈశ్వరీ దేవి మఠం మఠాధిపతులు శ్రీ శ్రీ వీర శివకుమార్ స్వాముల వారు తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కానాల మల్లికార్జున రెడ్డి తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి సొసైటీ చైర్మన్ సాంబశివారెడ్డి చేతుల మీదుగా ప్రధానం చేశారు ఈ సందర్భంగా మఠాధిపతులు వీర శివకుమార్ స్వాముల వారు మాట్లాడుతూ ముగ్గులు శాస్త్రీయతకు నిలయమైనవని ముగ్గులలో ఎంతో శాస్త్రీయత దృక్పథం దాగి ఉందని చుక్కతో మొదలై ఎన్నో నుడికారాలతో ముగ్గులను తీర్చిదిద్ది ఎంతో అలంకారప్రాయంగా వేయడం మన సాంప్రదాయానికి ప్రత్యేకగా ఈ రంగవల్లులను గీయడం జరుగుతుందని కనుక ముగ్గులు కేవలం ఆకర్షణకు వేయడమే కాకుండా అందులో ఎంతో శాస్త్రీయత దాగి ఉందని మరి ఇలాంటి మంచి కార్యక్రమాన్ని ఈ సంక్రాంతి పండుగ వేళను పురస్కరించుకొని శ్రీ ఈశ్వరి దేవి మఠంలో ఏర్పాటు చేసినందుకుగాను సంతూర్ షాపు సమస్త వారికి ప్రత్యేక కృతజ్ఞతలని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంతూర్ సోపు నిర్వాహకులు భారత్ కుమార్, తెలుగుదేశం పార్టీ మండల ఉపాధ్యక్షులు శీలం నరసింహ గౌడ్, పూజా శివ, వెంకట సుధా సౌండ్ సిస్టం అధినేతలు ఉమాపతి భాస్కర్ రెడ్డి, వ్యాఖ్యాత ఈశ్వర్ రెడ్డి, సుంకు సురేష్ సంపత్ కుమార్, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు




# వైభవంగా అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమాలు





**పులివెందుల– సూర్య వాస్తవం :** పులివెందులలోని కోతి సమాధి వద్ద వెలసిన అయ్యప్ప స్వామి ఆలయం నందు బుధవారం పడిపూజ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో భాగంగా ఉదయాస్తమాన హరిహర సుతుడు అన్నదాన ప్రభువు అయ్యప్ప స్వామికి ఆలయ ప్రధాన అర్చకులు మధు స్వామి, గురుస్వామి వెంకట రామిరెడ్డి ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, సహస్రనామార్చన తదితర విశేష పూజల అనంతరం ప్రత్యేక అలంకారంలో అయ్యప్ప స్వామి దర్శనం ఇవ్వగా మహా మంగళహారతి తో అయ్య ప్పల శరణు ఘోషతో ఆలయం మారుమ్రోగింది. అనంతరం సాయంకాల సమయాన మకర జ్యోతి దర్శన శుభ ఘడియలలో పడిమెట్ల పడిపూజ కార్యక్రమాలను సాంప్రదాయ బద్ధంగా వివిధ భజన కార్యక్రమాలతో కొనసాగాయి. ఈ సందర్భంగా హాజరైనటువంటి భక్త జనానికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అల్పాహార భిక్షను అందించారు.

# రోడ్డు భద్రత, సైబర్ మోసాలపై అవగాహన



**గుత్తి – సూర్య వాస్తవం :** గుత్తి మండలంలో జిల్లా ఎస్పీ పి.జగ దీష్ ఐపీస్ ఆదేశాల మేరకు గుత్తి పోలీసు స్టేషన్ పరిధిలో వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమాలు పోలీస్ స్టేషన్ పరిధిలోని లచ్చానిపల్లి,కొజ్జేప ల్లి, చెర్లోపల్లి, పూలకుంట, బ్రాహ్మణపల్లి గ్రామాలలో సి.ఐ రామారావు తన సిబ్బందితో కలిసి అవగాహన కార్యక్ర మాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు సామాజిక చెడులు వల్ల కలిగే దుష్పరిణామాలు, మద్యం, జూదం, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలు గురించి వివరించారు. అదేవిధంగా రోడ్డు భద్రతపై మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం సురక్షితమన్నారు. మద్యం తాగి వాహనాలు నడపకూడదని, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పెరుగుతున్న సైబర్ మోసాలపై ప్రజలను అప్రమత్తం చేస్తూ, అను మానాస్పద ఫోన్ కాల్స్, లింకులు, ఓటీపీలు ఎవరికీ చెప్పవద్దని తెలియజేశారు. ఆన్‌లైన్ మోసాల బారిన పడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం ఎంతో అవసరమని, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని సిఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో గుత్తి పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో శ్రీకృష్ణ గోదాదేవిల కళ్యాణం





**పులివెందుల– సూర్య వాస్తవం :** పులివెందుల పట్టణంలోని పురాతనమైనటువంటి శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో భోగి పండుగన సందర్భంగా శ్రీకృష్ణ గోదాదేవిల కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు రాజేష్ శర్మ నాగేంద్ర శర్మల ఆధ్వర్యంలో ఈ కళ్యాణాన్ని నిర్వహించారు. కళ్యాణంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు, లెక్చరర్ వెంకట రామిరెడ్డి దంపతులు ఉభయదారులుగా పాల్గొన్నారు. అంతకుముందు భోగి పండుగను పురస్కరించుకొని ఆలయంలో భోగి మంటలను ఈవో కె.వి.రమణ ఆధ్వర్యంలో ఉదయం వేయడం జరిగింది స్వామివారికి ప్రత్యేక అభిషేకం పూజలు నిర్వహించారు అనంతరం కల్యాణ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కళ్యాణ కార్యక్రమంలో శ్రీ రంగనాథ స్వామి శాశ్వత ఉభయ దారులు చల్లా వంశీయులు శ్రీ గోదామాత విగ్రహ దాతలు కట్టకింది పల్లె ఆదినారాయణ, భక్తవత్సలం నాయుడు చల్లా చంద్రశేఖర్ నాయుడు,అలాగే నూలు పూజ ఉత్సవ ఉభయ దారులు నారాయణ, అంకాలమ్మ దేవస్థానం చైర్మన్ తిరుమల శెట్టి నాగేంద్రప్రసాద్ దంపతులు, శ్రీ రంగనాథ ట్రస్ట్ తరఫున సీఈఓ అల్లం రంగనాయకులు రాయల్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి మహిళలు పెద్ద సంఖ్యల హాజరయ్యారు. అనంతరం అన్న ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. 30 రోజులు పాటు గీతా పారాయణం గోదా దేవి పాశురాల ఆలాపన. శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకొని పట్టణానికి చెందినటువంటి రిటైర్డ్ లెక్చరర్ నాగమల్లారెడ్డి పార్వతి దంపతుల ఆధ్వర్యంలో వారి బృందం 30 రోజులపాటు భగవద్గీత పారాయణం, గోదాదేవి పాశురాల ఆలాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం చివరి రోజు వారు ఈ కార్యక్రమాన్ని ఎంతో ఘనంగా నిర్వహించారు.

## అనగనగా ఒక రాజు'
## ప్రేక్షకులకు కృతజ్ఞతలు : నవీన్ పొలిశెట్టి

ఈసంక్రాంతిని నవ్వుల పండుగలా మార్చడానికి 'అనగనగా ఒక రాజు' చిత్రంతో థియేటర్లలో అడుగుపెట్టారు స్టార్ ఎంటర్‌టైనర్ నవీన్ పొలిశెట్టి. మూడు వరుస ఘన విజయాలతో ప్రేక్షకుల హృదయాలలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న నవీన్ పొలిశెట్టి కథనాయకుడిగా నటించిన ఈ చిత్రాన్ని.. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. నూతన దర్శకుడు మారి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో మీనాక్షి చౌదరి కథనాయిక. మిక్కీ జె మేయర్ సంగీతం అందించారు.

భారీ అంచనాలతో సంక్రాంతి కానుకగా నేడు(జనవరి 14) ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'అనగనగా ఒక రాజు' చిత్రం.. మొదటి ఆట నుంచే అద్భుతమైన స్పందనను సొంతం చేసుకుంది. కడుపుబ్బా నవ్వించడమే కాకుండా, చివరిలో భావోద్వేగ సన్నివేశాలతో హృదయాలను హత్తుకొని.. అసలు సిసలైన పండగ సినిమాలా ఉందని 'అనగనగా ఒక రాజు' చూసిన ప్రతి ఒక్కరూ అభిప్రాయపడుతున్నారు. మొదటి షో నుంచే 'అనగనగా ఒక రాజు' సినిమాకి ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతుండటంతో.. తాజాగా సక్సెస్ ప్రెస్ మీట్ నిర్వహించిన చిత్ర బృందం, ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలపడంతో పాటు తమ సంతోషాన్ని పంచుకుంది.

స్టార్ ఎంటర్‌టైనర్ నవీన్ పొలిశెట్టి మాట్లాడుతూ.. "ముందుగా అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు. ఓవర్సీస్ లో ప్రీమియర్ షోల నుంచే అద్భుతమైన స్పందన లభించింది. థియేటర్ లో ప్రతి ఒక్కరూ సినిమాని ఎంతగానో ఎంజాయ్ చేస్తున్నారు. నాన్ స్టాప్ ఎంటర్టైన్మెంట్ అంటూ ప్రేక్షకుల నుంచి ఈ స్థాయి స్పందన రావడం సంతోషంగా ఉంది. ఇంకా సినిమా చూడనివారు టికెట్ బుక్ చేసుకొని వెళ్ళండి. ఖచ్చితంగా ఎంజాయ్ చేస్తారు. ఈ రోజు ఉదయం హైదరాబాద్ లోని శ్రీరాములు థియేటర్ లో ప్రేక్షకులతో కలిసి సినిమా చూశాము. ఫస్ట్ హాఫ్, సెకండ్ హాఫ్ అనే తేడా లేకుండా సినిమా అంతా నవ్వుతూనే ఉన్నారు ప్రేక్షకులు. అదే సమయంలో క్లైమాక్స్ లో ఎమోషన్ కూడా బాగా వర్కౌట్ అయిందని అంటున్నారు. హాయిగా నవ్వుకుందామని వస్తే, చివరిలో కంటతడి పెట్టించారు అంటూ ఎందరో ప్రశంసిస్తున్నారు. మొదటి షో నుంచే బ్లాక్ బస్టర్ టాక్ ని ఇచ్చిన ప్రేక్షకులకు పేరుపేరునా కృతజ్ఞతలు. మాకు మద్దతుగా నిలిచిన మీడియా మిత్రులకు ధన్యవాదాలు." అన్నారు.

కథనాయిక మీనాక్షి చౌదరి మాట్లాడుతూ.. "మా సినిమాకి ప్రేక్షకుల నుంచి వస్తున్న అద్భుతమైన స్పందన చాలా సంతోషాన్ని కలిగించింది. ఈ ఫలితం మా అందరి కష్టాన్ని మర్చిపోయేలా చేసింది. నేను పోషించిన చారులత పాత్ర బాగుందని అందరూ ప్రశంసించడం ఆనందంగా ఉంది. నటిగా ఇది ఛాలెంజింగ్ పాత్ర. మొదటిసారి ఇలాంటి క్యూట్ మాస్ కామెడీ చేశాను. సంక్రాంతి పండుగకు నేను నటించిన సినిమా విడుదలై విజయం సాధించడం నాకు మరింత ఆనందాన్ని ఇచ్చింది. అందరూ ఈ సినిమా చూసి ఎంజాయ్ చేస్తారని ఆశిస్తున్నాను." అన్నారు.

నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ.. "అనగనగా ఒక రాజు సినిమాపై ముందు నుంచి నమ్మకంగా ఉన్నాము. ఆ నమ్మకాన్ని ప్రేక్షకులు నిజం చేశారు. అన్ని చోట్లా సినిమాకి పాజిటివ్ టాక్ వస్తోంది. ప్రేక్షకులు సినిమాలో కామెడీని ఎంత ఎంజాయ్ చేస్తున్నారో.. అంతకన్నా ఎక్కువ చివరిలో ఎమోషన్ కి కనెక్ట్ అవుతున్నారు.




రానున్న రోజుల్లో థియేటర్ల సంఖ్య పెరిగే అవకాశముంది. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్ లో భారీ వసూళ్లు వస్తాయి." అన్నారు.

చిత్రం: అనగనగా ఒక రాజు
తారాగణం: నవీన్ పొలిశెట్టి, మీనాక్షి చౌదరి
సంగీతం: మిక్కీ జె. మేయర్
దర్శకత్వం: మారి
నిర్మాతలు: సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య
నిర్మాణ సంస్థలు: సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్
సమర్పణ: శ్రీకర స్టూడియోస్
పీఆర్‌ఓ: లక్ష్మీవేణుగోపాల్

### ప్రయాణ సమయం కూడా
## పని గంటల్లోనే ...

ఫిల్మ్ ఇండిస్ట్రీలో పని గంటల విషయంపై తాజాగా రాధికా ఆప్టే మాట్లాడారు. ఇటీవల ఆమె ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ .. 'వారం రోజుల పాటు నా బిడ్డను చూడకుండా ఉండటం నాకు సాధ్యం కాదు. అందుకే షూటింగ్ గంటలను మార్చాల్సిన అవసరం చాలా ఉంది. ఈ నిర్ణయం తీసుకునే క్రమంలో ఎన్నో వాదనలు, గొడవలను ఎదుర్కోవాల్సి వచ్చింది. కానీ ఒక నటిగా తన హక్కుల కోసం ఎంతగా పోరాడాలో తెలిసి.. ఆశ్చర్యపోయా. అలాంటప్పుడు అమ్మమ్మ నాన్నమ్మను సెట్‌కు తీసుకురమ్మని చాలామంది సలహాలు ఇస్తున్నారు, కానీ అది సరైన పరిష్కారం కాదు. మాతృత్వానికి ప్రాధాన్యత ఇవ్వడమే నాకు ముఖ్యం' అని రాధికా స్పష్టం చేశారు. ఇకపై తాను సైన్ చేసే సినిమాల విషయంలో 'రోజుకు గరిష్టంగా 12 గంటల షిఫ్ట్ మాత్రమే ఉండాలని, అందులో ప్రయాణం, మేకప్, హెయిర్, షూటింగ్ సమయం అంతా కలిపి ఉండాలని ఆమె పేర్కొన్నారు. ఒకవేళ ప్రయాణానికే రెండు గంటలు పడితే, దానిని కూడా పని గంటలు గానే పరిగణించాలని' ఆమె వ్యాఖ్యానించారు. అంతేకాకుండా, వీలైనంత వరకు వారానికి ఐదు రోజులు మాత్రమే పని చేస్తానని, వారపు సెలవు కచ్చితంగా ఉండాలని .. కేవలం చిన్న సినిమాల విషయంలో మాత్రమే కొన్ని మినహాయింపులు ఇస్తానని చెప్పారు. తన వృత్తిపరమైన బాధ్యతలతో పాటు బిడ్డతో గడిపే సమయానికి ఎక్కడా రాజీ పడబోనని కూడా రాధికా ఈ సందర్భంగా గట్టిగా పేర్కొన్నారు.





## డారిల్ మిచెల్ అజేయ సెంచరీ

- విల్ యంగ్ మెరుపులు
- రెండో వన్డేలో న్యూజిలాండ్ విజయం
- సిరీస్ సమం
- రాహుల్ రికార్డు శతకం వృధా




రాజ్‌కోట్: భారత్‌తో జరిగిన రెండో వన్డేలో న్యూజిలాండ్ ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. భారత్ విధించిన 285 పరుగులు లక్ష్యచేధనలో డారిల్ మిచెల్ (131 నాటౌట్, 117 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్స్‌లు) శతకంతో అజేయంగా నిలవగా, విల్ యంగ్ (87; 98 బంతుల్లో 7 ఫోర్లు) అర్ధ సెంచరీతో ఆకట్టుకున్నాడు. దీంతో ఈ లక్ష్యాన్ని న్యూజిలాండ్ 47.3 ఓవర్లలోనే 3 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. ఈ విజయంతో ఈ మూడు వన్డేల సిరీస్‌ను కివీస్ 1-1తో సమం చేసింది. భారత గడ్డపై భారత్‌పై వన్డేల్లో ఇంతటి భారీ లక్ష్యాన్ని చేధించడం కివీస్‌కు ఇదే మొదటిసారి. లక్ష్య చేధనలో కివీస్ ఓపెనర్లు డేవాన్ కాన్వే (16), హెన్రీ నికోల్స్ (10) త్వరగానే నిష్క్రమించినా.. తర్వాత వచ్చిన విల్ యంగ్, డారిల్ మిచెల్ మూడో వికెట్‌కు 162 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. జట్టు స్కోరు 208 పరుగుల వద్ద విల్ యంగ్ మూడో వికెట్‌గా పెవిలియన్ చేరుకున్నాడు. తరువాత క్రీజ్‌లోకి వచ్చిన గ్లెన్ ఫిలిప్స్ (32, 25 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. భారత బౌలర్లలో హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కఅష్ణ, కుల్‌దీప్ యాదవ్ ఒక్కో వికెట్ పడగొట్టారు. రెండో వన్డేలో విజయంతో సిరీస్‌ను కివీస్ సమం చేయడంతో చివరిది, మూడో వన్డే కీలకంగా మారింది. ఈ సిరీస్ నిర్ణయాత్మక మూడో వన్డే జనవరి 18న ఇండోర్‌లో జరగనుంది.

బుధవారం మ్యాచ్‌లో ముందుగా టాస్ ఓడిన భారత్ బ్యాటింగ్‌కు దిగింది. నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 284 పరుగులు చేసింది. ఒక దశలో కష్టాల్లోఉన్న భారత్‌ను కెఎల్ రాహుల్ (112; 92 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీతో ఆదుకున్నాడు. దీనికి ముందు ఓపెనర్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (56; 53 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్) వరుసగా రెండో అర్ధ శతకం చేశాడు. బ్యాటింగ్‌కు దిగిన భారత్ జట్టులో ఓపెనర్లు రోహిత్, గిల్ తొలి వికెట్‌కు 70 పరుగులు జోడించారు. రోహిత్(24 పరుగులు)ను తొలివికెట్‌గా క్రిస్టియన్ క్లార్క్ వెనక్కి పంపాడు. ఒక దశలో 99/1తో పటిష్ఠ స్థితిలో భారత్ నిలిచింది. అయితే ఈ దశలో గిల్, శ్రేయస్ అయ్యర్ (8), విరాట్ కోహ్లీ (23) వరసగా పెవిలియన్ చేరడంతో 118/4తో కష్టాల్లో పడింది. 18-27 ఓవర్ల మధ్య భారత బ్యాటర్లు ఒక్క బౌండరీ కూడా కొట్టలేదు. ఈ క్రమంలో రవీంద్ర జడేజా (27 పరుగుల)తో కలిసిరాహుల్ భారత్ ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టాడు. ఈ జోడీ ఐదో వికెట్‌కు 88 బంతుల్లో 73 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పింది.

అయితే ఐదో వికెట్‌గా జడేజా మైకేల్ బ్రాస్‌వెల్‌కు రిటర్న్ క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అనంతరం క్రీజ్‌లోకి వచ్చిన నితీశ్‌కుమార్‌రెడ్డితో జతకట్టిన.. రాహుల్ 52 బంతుల్లో అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. నితీశ్ (20 పరుగులు) ఫౌక్స్ ఔట్ చేయగా.. కాసేపటికే హర్షిత్ రాణా (2)ను జేడెన్ లెనాక్స్ పెవిలియన్‌కు పంపాడు. అప్పటికి 87 పరుగులతో ఉన్న రాహుల్ జేమీసన్ వేసిన 49 ఓవర్‌లో ఫోర్, సిక్స్ కొట్టి శతకం (87 బంతుల్లో) అందుకున్నాడు. చివరి ఓవర్‌లో రాహుల్ రెండు ఫోర్లతో భారత్‌కు మొత్తంగా 12 పరుగులు లభించాయి. రాహుల్‌తో పాటు సిరాజ్ (2) అజేయంగా నిలిచాడు. ఈ సెంచరీతో కెఎల్ రాహుల్ అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. న్యూజిలాండ్‌పై సెంచరీ చేసిన తొలి భారత వికెట్ కీపర్‌గా నిలిచాడు. అలాగే రాజ్‌కోట్‌లో సెంచరీ చేసిన తొలి భారత బ్యాటర్‌గా నిలిచాడు. న్యూజిలాండ్ బౌలర్లలో క్రిస్టియన్ క్లార్క్ 3, జేమీసన్, ఫౌక్స్, జేడెన్ లెనాక్స్, మైకేల్ బ్రాస్‌వెల్ ఒక్కో వికెట్ పడగొట్టారు. అజేయ సెంచరీతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన న్యూజిలాండ్ బ్యాటర్ డారిల్ మిచెల్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.



# పండుగ వేళ రైతులు సుభిక్షంగా ఉండాలి....!

- జిల్లా ప్రజలు ప్రశాంతంగా జీవించాలి
- అనంతపురం జిల్లా ఎస్పీ పి.జగదీష్
- జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో గ్రామీణ సంస్కృతి ఉట్టిపడేలా సంక్రాంతి సంబరాలు
- ముఖ్య అతిథులుగా పాల్గొన్న జిల్లా ఎస్పీ పి.జగదీష్... ఆయన సతీమణి హేమ జగదీష్







**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం:** సంక్రాంతి అంటే ఇంటి ముందు అందమైన రంగవల్లులు, పిండివంటలు, చిన్నపిల్లల సందడి ఇవి మాత్రమే కాదు. పండుగ అంటే సంప్రదాయ దుస్తులు. పండుగ నాడు మహిళలు పట్టు చీరల్లో మెరిస్తే.. మగవారు పంచెలతో అదర గొడతారు. ఇది సర్వసాధారణమే.. అయితే ఎప్పుడూ ఖాకీ దుస్తుల్లో ఉండే పోలీసులు పంచెలు కడితే అది కదా అసలు పండ గంటే. అనంతపురం జిల్లా పోలీసులు కూడా పట్టుబట్టలు కట్టుకుని సంక్రాంతి సంబరాలు చేసు కున్నారు.. .వారు ఖాకీ దుస్తులు వేసినా.. లాఠీ పట్టినా దొంగలకు దడ. నిత్యం ఖాకీ బట్టలతో తీరిక సమయం లేకుండా గడిపే పోలీసులకు పండుగ నాడు కూడా పనే ఉంటుంది. వారికీ తమ కుటుంబ సభ్యులతో కలిసి పండుగ జరుపుకుని ఆనందంగా ఉండాలని అనుకుంటారు. కానీ అందుకు వారికి సమయం దొరకకా అటువంటి ఆనందాలను మిస్ అవుతున్నారు. అయితే అనంతపురం జిల్లాలో పోలీసులు మాత్రం సంక్రాంతి సంబరాలు జరుపుకుని వారి కుటుంబాలతో ఆనందంగా గడిపారు.గ్రామీణ సంస్కృతికి దర్పణం పట్టే విధంగా సంక్రాంతి సంబరాలు జరిగాయి. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నాడు జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో నిర్వహించిన సాంప్రదాయ సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. సంక్రాంతి సంబరాలలో జిల్లా ఎస్పీ దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. భోగి మంటలు వెలిగించారు. గాలిపటాలు ఎగురవేశారు. జిల్లా ఎస్పీ గుండాట ఆడారు. ఉట్టి కొట్టారు. ఇలా పలు రకాల సంప్రదాయాల క్రీడలు నిర్వహించారు. అలంకరించిన ఎద్దుల బండి ఎక్కి రైతుల తరహా జిల్లా ఎస్పీ రైతు బిడ్డలా ఎద్దుల బండి తోలారు. పోలీసు సిబ్బంది వేసిన ముగ్గులను పరిశీలించారు. ప్రతిభావంతుల్ని అభినంది ంచారు. పిల్లలకు ఎస్పీ సతీమణి హేమ జగదీష్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.... ముందుగా జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలు ప్రశాంతంగా జీవించాలని... ముఖ్యంగా రైతులు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. పోలీసులు తమ విధుల్లో నిత్యం బ్యుజీగా ఉంటారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల కాస్త ఉపశమనం కల్గి మరింత ఉత్తేజంతో ముమ్ముందు విధులు నిర్వర్తించే అవకాశం ఉందన్నారు. సాంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని... అసాంఘిక కార్యకలాపాల జోలికెళ్లకుండా సంక్రాంతి పర్వదినం ఇంటిల్లిపాది సంతోషంగా జరుపు కోవాల న్నారు.ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపిఎస్ అధికారి అశ్విని మణిదీప్, ఏ.ఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా, డీఎస్పీలు వి.శ్రీనివాసరావు, నీలకంఠేశ్వరరెడ్డి(ఏ.ఆర్), పలువురు సి.ఐ లు, ఆర్ ఐ లు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు, ఆర్ ఎస్ ఐ లు, పోలీసు సిబ్బంది వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## పాత బాధలు వెళ్లి సంక్రాంతితో కొత్త సంతోషాలు రావాలి

### - పట్టణ వైకాపా అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి



**పులివెందుల – సూర్య వాస్తవం :** అన్ని వర్గాల ప్రజలు పాడిపంటలతో సుఖ సంతోషాలతో జీవించాలని ఆయురారోగ్యాలు కలగాలని, పాత బాధలు వెళ్లి 2026 ఈ సంక్రాంతి పండుగతో కొత్త సంతోషాలు రావాలని సంక్రాంతి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో కాంతులు నింపాలి, వైసిపి ప్రజాప్రతినిధులకు శ్రేయోభిలాషులకు అభిమానులకు శ్రేయోభిలాషులకు ప్రతి ఒక్కరికి సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు పులివెందుల పట్టణ వైకాపా అధ్యక్షుడు హల్ గంగాధర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా హల్ గంగాధర్ రెడ్డి సంక్రాంతి పండుగను పురస్కరించుకుని తన మనసులోని భావాలను పంచుకుంటూ, చెరుకులోని తీయదనం, పాలలోని తెల్లదనం, గాలిపటంలోని రంగుల అందం, మీ జీవితాలలో సంక్రాంతి పండుగ ఆనందం నింపాలని, భోగి భాగ్యాలతో, సంక్రాంతి సిరిసంపదలతో, కనుమ కనువిందుగా, మామిడి తోరణాలతో, ముత్యాల ముగ్గులతో పసుపు కుంకుమలతో పచ్చ తోరణం తో కలకలలాడే వాకిళ్ళతో మీ ఇల్లు ఆనంద నిలయం సుఖశాంతులతో పండుగ జరుపుకోవాలని కోరుకుంటూ, గతంలో ఉన్న పాత బాధలు వెళ్లి ఈ సంక్రాంతి పండుగతో కొత్త సంతోషాలు ప్రతి ఇంట రావాలని హాల్ గంగాధర్ రెడ్డి ఆశిస్తూ ప్రతి ఒక్కరికి సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపిన బివిఎస్ ట్రాన్స్‌పోర్ట్ అధినేత



**పులివెందుల – సూర్య వాస్తవం :** సకల శుభాలకు శోభ తెచ్చే పండుగ మకర సంక్రాంతి, పండుగలలో అతి పెద్దగా జరుపుకునే పండగ మకర సంక్రా ంతిఅని ప్రజలకు అభిమానులకు శ్రేయోబి.లాషులకు ట్రాన్స్పోర్ట్ సిబ్బందికి బి విఎస్ ట్రాన్స్పోర్ట్ అధినేత బివి సుబ్బారెడ్డి బ్రదర్స్ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి సాంప్రదాయాలకు నిలయమైన సంక్రాంతి పండుగ విషయాలు పంచుకుంటూ, యుగాలు మారిన, తరాలు మారిన చెక్కుచెదరని మన సాంప్రదాయ, సంస్కృతిని లోని మంచి భావాలను, విలువలను మనము ఆచరిస్తూ ఇతరులకు స్ఫూర్తినిస్తూ రాబోయే తరానికి ఈ సాంప్రదాయం యొక్క విలువలను ,గొప్పదనాన్ని వివరిస్తూ, తెలియపరుస్తూ ప్రకృతితో, వ్యవసాయంతో, పౌరుషాలతో మమేకమైన ఈ పండుగ మీకు మీ కుటుంబ సభ్యులకు సుఖ సంతోషాలను అందించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ, ఈ సంక్రాంతి పండుగ వచ్చిందంటే చాలు వాతావరణానికి కొత్త కాంతులు వచ్చినట్లే అని, పట్టణం పల్లెటూర్లలో తెలుగువారు ఎక్కడ చూసినా కుటుంబ సభ్యులతో కలిసి ఆనందం సంతోషం వెల్లి విరుస్తోందన్నారు. ప్రతి ఒక్కరికి పేరుపేరునా సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ ప్రతి ఇంటిలో భోగభాగ్యాలు వర్ధిల్లాలని కుటుంబ సభ్యులతో ఆనందంగా పండుగ జరుపుకోవాలని బివి సుబ్బారెడ్డి ఆకాంక్షించారు.

## ఆపరేటర్ రామయ్యను పరామర్శించిన తులసి రెడ్డి



**వేంపల్లె – సూర్య వాస్తవం :** వేంపల్లి పాత పేటకు చెందిన ఆపరేటర్ రామయ్య ఇటీవలనే గుండెకు శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటికి వచ్చారు. కాంగ్రెస్ నాయకులు తులసి రెడ్డి,సుబ్రమణ్యం, ధ్రువ కుమార్ రెడ్డి,అమర్నాథ్ రెడ్డి,ఉత్తన్న, వినయ్ రామయ్య ను పరామర్శించారు రామయ్య త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## ధనుర్మాస ఉత్సవాలు ముగింపు







**పామిడి – సూర్య వాస్తవం :** పామిడి కన్యకా పరమేశ్వరి దేవాలయ ప్రాంగణంలో నెల రోజు లపాటు నిర్వహించిన ధనుర్మాస ఉత్సవాలు బుధవారం ఘనంగా ముగిసాయి.భక్తులు పెద్దఎత్తున రావడం తో ఆలయం కళకళ లాడింది. తిరుప్పావై, భగవద్గీత,, స్తోత్ర పారాయణలు పఠించారు. గోదాదేవి, శ్రీకృష్ణ అష్టోత్తర శతనామావాలి పుష్పర్చన గావించారు. గోదాదేవి,శ్రీకృష్ణ, విశ్వరూప సందర్శన చిత్ర పటాలను శోభయమానంగా అలంకరణ చేశారు. అమ్మవారి మూల విరాట్, ఉత్సవ విగ్రహాలను గోదాదేవి గా తీర్చి దిద్దారు. సెలవు పాట పాడారు. మహా మంగళ హారతి గావించి తీర్థ ప్రసాదాలు అందించారు.అలాగే అనంత, గజ, గరుడ లక్ష్మీ నారాయణ స్వామి దేవాలయం లో ధనుర్మాస, ఏకాదశి పూజలు చేశారు.

## టీడీపీ నేత కామిరెడ్డి అశోక్ కుమార్ రెడ్డికి పితృవియోగం

**నాయుడుపేట– సూర్య వాస్తవం:** నాయుడుపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కామిరెడ్డి అశోక్ కుమార్ రెడ్డి తండ్రి, సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు కామిరెడ్డి జానకిరామ రెడ్డి బుధవారం కన్నుమూశారు. ఆయన మృతితో నాయుడుపేట రాజకీయ వర్గాల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న వెంటనే మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం మడపలంలోని వారి నివాసానికి చేరుకుని, కామిరెడ్డి జానకిరామ రెడ్డి పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా నాయుడుపేట మాజీ ఏఎంసీ చైర్మన్ సిరసనంభేటి విజయభాస్కర్ రెడ్డి, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, సీనియర్ టిడిపి నాయకులు సన్నారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, అన్నమేడు పిహెచ్‌సి ఎస్ చైర్‌పర్సన్ రామచంద్ర రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ గోను బాబు హాజరై నివాళులు అర్పించారు. అలాగే టిడిపి నాయకులు దువ్వూరు శ్రీధర్ రెడ్డి, కరీంభాయి చెంచయ్య, నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ఉగ్గుమూడి భాస్కర్ రెడ్డి, పేరంశెట్టి శ్రీరామ్ ప్రసాద్, గూడూరు సుధీర్ రెడ్డి తదితరులు పార్థివ దేహానికి పూలమాలలు వేసి తమ సంతాపం తెలిపారు. కామిరెడ్డి అశోక్ కుమార్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన నాయకులు, ఈ అపార దుఃఖాన్ని తట్టుకునేలా భగవంతుడు వారికి మనోధైర్యం ప్రసాదించాలని ఆకాంక్షించారు.





## భోగి మంటల్లో ప్రభుత్వ జీవోలు వేస్తారా

### - వైసీపీ వికృత చేష్టలను ప్రజలు ఆమోదించరు
### - మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్ర టీడిపి అధికార ప్రతినిధి గౌనివారి శ్రీనివాసులు

**శాంతిపురం – సూర్య వాస్తవం :** భోగి పండగ రోజున ప్రజలకు మేలు చేసే ప్రభుత్వ జీవోలను మంటల్లో దహనం చేయడం వైసీపీ రాజకీయ నిరాశా నిస్పృహలకు నిదర్శనమని మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు అన్నారు.బుధవారం ఆయన మీడియాకు ఓ ప్రకటనను విడుదల చేశారు. వైసిపి నేతలు చేస్తున్నది ప్రజాస్వామ్య నిరసన కాదని ప్రజా మనోభావాలకు అవమానం కలిగించే విధంగా ఉందన్నారు. వైసిపి చేస్తున్న ఇలాంటి వికృతి చేష్టలను ప్రజలు ఆమోదించరని అన్నారు. జీవోలను కాల్చడం కాదు వైసీపీ అబద్ధాలు, వైఫల్యాలే ఆ మంటల్లో కాలుతున్నాయ నిపే ర్కొన్నారు. మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌కు అప్పగిస్తున్నామన్నది వైసీపీ సృష్టించిన తప్పుడు ప్రచారం.గత ఐదేళ్లలో పూర్తి చేయలేని మెడికల్ కాలేజీలపై మాట్లాడే హక్కు వైసీపీకి లేదు. ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేస్తే దాన్ని ప్రైవేటీకరణ అంటారా అని ప్రశ్నించారు. వైసీపీ పాలనలో వైద్య వ్యవస్థ కుప్పకూలింది. ఇప్పుడు మార్పులు కనిపిస్తే అరాచకం అంటున్నారు. సంక్రాంతి శోభ లేదనడం ప్రజల ఆనందంపై దాడి చేయడమేనని తెలిపారు. అధికారంలేక పార్టీ ఉనికి కోసం వైసీపీ నేతలు ఆందోళనలు చేస్తున్నారు తప్ప ప్రజల కోసం కాదని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం నిబద్ధతతో పని చేస్తోంది.అదే వైసీపీకి మంటగా మారిందన్నారు. జీవోలు కాల్చొచ్చు కానీ అసలు నిజం కాలిపోదన్నారు.

## నూతన హోటల్‌ను ప్రారంభించిన టీడీపీ ఇన్‌చార్జ్ బీటెక్ రవి





**పులివెందుల – సూర్య వాస్తవం :** పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాపురంలో టీడీపీ కార్యకర్త వేణుగోపాల్ నూతనంగా ఏర్పాటు చేసిన హెూటల్‌ను పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయడం అభినందనీయమని పేర్కొన్నారు. వేణుగోపాల్ రెడ్డి హెూటల్ వ్యాపారంలో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఈశ్వరమ్మకు శ్రద్ధాంజలి ఘటించిన తులసిరెడ్డి



**వేంపల్లె – సూర్య వాస్తవం :** కాంగ్రెస్ పార్టీ వేంపల్లి మండల శాఖ అధ్యక్షుడు బీగాల రామకృష్ణ అత్తమ్మ పులిబండ్ల ఈశ్వరమ్మ బుధవారం అనారోగ్యంతో స్వర్గస్తులయ్యారు. కాంగ్రెస్ నాయకులు తులసి రెడ్డి,సుబ్రహ్మణ్యం, ధ్రవ కుమార్ రెడ్డి,అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న వినయ్ బద్రీనాథ్ రాఘవయ్య ఈశ్వరమ్మ భౌతిక కాయానికి శ్రద్ధాంజలి ఘటించారు.ఆవిడ పవిత్ర ఆత్మకు ప్రశాంతిని ప్రసాదించాలని పరమేశ్వరుని ప్రార్థించారు ఈశ్వరమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )